విద్యార్థులు పరీక్షలకు సంసిద్ధం కావాలి

ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన



మాట్లాడుతున్న ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి కల్పన

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రానున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు విద్యార్థులు సంసిద్ధం కావాలని, శ్రద్ధతో చదివి పరీక్షల్లో విజయం సాధించాలని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి డి.కల్పన అన్నారు. బుధవారం గోదావరిఖని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఫేర్‌వెల్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇంటర్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులతో విజయం సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. అనంతరం మంచిర్యాల మలబార్ గోల్డ్‌డైమండ్స్, మలబార్ గోల్డ్ చారిటీ ఆధ్వర్యంలో 24 మంది విద్యార్థులకు చెక్కులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ రాజేందర్, అధ్యాపకులు శంకర్, సంపత్, అనురాధ, కవిత, ప్రశాంతి, నరేష్, రామకృష్ణ, రఘు, సంతోషి, నాగరాణి, కోమలత, రాజ్యలక్ష్మి, మలబార్ డైమండ్స్ గోల్డ్ సంబంధించి ఎంప్లాయిస్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఊపందుకున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం





- ఓటర్లపై గురి పెట్టిన కాంగ్రెస్, బీజేపీ
- నియోజకవర్గాల వారీగా సమావేశాలు
- ఓటర్లను కలిసే బాధ్యతలు నాయకులకు
- జోరుగా వాయిస్ మెస్సేజ్‌లు, ఎస్ఎంఎస్‌లు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జిల్లాలో ఊపందుకున్నది. పోటాపోటీగా అభ్యర్థులు ప్రచారం చేస్తూ ఓటర్లను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 56 మంది అభ్యర్థులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 15 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఈ నెల 27వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనున్నది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరుగుతున్న పోటీలో బీజేపీ అభ్యర్థితో పాటు వివిధ ఉపాధ్యాయ సంఘాల కు చెందిన నాయకులు పోటీ పడుతున్నారు. ఈసారి ప్రైవేట్ విద్యా సంస్థల్లో పని చేసే ఉపాధ్యాయులకు కూడా ఓటు హక్కు కల్పించడంతో ఓటర్ల సంఖ్య పెరిగింది.

అలాగే ప్రైవేట్ ఉపాధ్యాయులు సైతం పోటీ చేసేందుకు అర్హత ఉండడంతో పెద్దపల్లి జిల్లా బందం పల్లికి చెందిన మల్క కొమురయ్యను బీజేపీ బరిలో నిలిపింది. ఈ ఎన్నికకు సంబంధించి ఓటర్లు పని చేసే ప్రభుత్వ, ప్రైవేట్ పాఠ శాలల వద్దకు వెళ్లి ఓటు అభ్యర్థిస్తున్నారు. ఇళ్లకు కూడా వెళ్లి ప్రచారం చేస్తున్నారు. జిల్లాలో ఉపాధ్యాయుల ఓట్లు 1,111 ఉన్నాయి. ఎక్కువగా పెద్దపల్లి, రామగుండం, సుల్తానాబాద్ పట్టణాల్లో ఉపాధ్యాయ ఓటర్లున్నారు.వారినందరినీ సాయంత్రం వేళల్లో ఒక చోట సమావేశ పరిచి అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారు. వారి అనుచరులు ఓటర్ల వద్దకు వెళ్లి అభ్యర్థులతో ఫోన్లలో మాట్లాడుతున్నారు. కొన్ని చోట్ల దావత్‌లు కూడా నిర్వహిస్తున్నారని సమాచారం.

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటాపోటీ..

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, బీజేపీ నుంచి చిన్న మైల్ అంజిరెడ్డి, బీఎస్పీ నుంచి ప్రసన్న హరి కృష్ణ, ఏఐఎఫ్‌బీ నుంచి సర్దార్ రవీందర్‌సింగ్, ట్రస్మా మద్దతుతో యాదగిరి శేఖర్ రావు, మహ్మద్ ముస్తాక్ అలీ, డాక్టర్ బండారి రాజ్‌కుమార్, తదితరులు మొత్తం 56 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

జిల్లాలో 31,037 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 19,008 మంది, మహిళలు 12,028 మంది, ఇతరులు ఒకరు ఉన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో 13,974 మంది, మంథని నియోజకవర్గంలో 5,020 మంది, రామగుండం నియోజకవర్గంలో 9,973 మంది, ధర్మపురి నియోజకవర్గం పరిధిలోని ధర్మారం మండలంలో 2,070 మంది ఓటర్లు ఉన్నారు. సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టు కునేందుకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పెద్దపల్లి, మంథని ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఈ నెల 17న ఒకేరోజు మూడు నియోజక వర్గాల్లో పట్టభద్రుల ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. రెండు రోజులుగా మండలాల వారీగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి ఓటర్లను కలిసే బాధ్యతలను అప్పగిస్తున్నారు.

బీజేపీ అభ్యర్థి తరఫున ఆ పార్టీ నాయకులు మండలాలు, పట్టణాల్లో ఓటర్ల వద్దకు వెళ్లి ప్రచారం చేస్తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

మిగతా 8వ పేజీలో



గుడి చెరువులో శివార్చన వేదిక వద్ద ఏర్పాట్లను చేస్తున్న సిబ్బంది

మహాశివరాత్రి జాతరకు ముమ్మర ఏర్పాట్లు

- వేములవాడ ఆలయంలో ముమ్మర ఏర్పాట్లు

7



కళ్యాణ్‌నగర్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలి

- రామగుండం కమిషనర్, అదనపు కలెక్టర్ అరుణశ్రీ

8

కనీస విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలి



కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

రామగిరి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతీ విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. రామగిరి మండలంలోని బుధవారం పేట్, పన్నూరు, రత్నాపూర్, బేగంపేట్ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. పన్నూరులోని కస్తూర్బా పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అవసరమైన వాటర్ హీటర్లు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రహరీ, డ్యూయల్ డెస్క్‌లకు ప్రతిపాదనలు అందించాలన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థుల పై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. ఉత్తమ బోధన పద్ధతులను అనుసరించాలని తెలిపారు. బేగంపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఎన్‌సీడీ స్క్రీనింగ్ వంద శాతం పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మాతాశిశు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు జరిగేలా తల్లులను ప్రోత్సహించాలని, పిల్లలకు టీకాలు అందుబాటులో ఉండే విధంగా చూడాలని, ఆర్‌బీఎస్‌కే ద్వారా పిల్లలకు వైద్య పరీక్షలు జరపాలని సూచించారు. అనేమియా నిర్మూలనకు కట్టుదిట్టంగా చర్యలు తీసుకొని అవసరమైన చికిత్స అందించాలని సూచించారు. రత్నాపూర్‌లోని మేడిపల్లిలో పర్యటించిన కలెక్టర్ పారిశ్రామిక పార్క్ ఏర్పాటుకు జారీ చేసిన ప్రాథమిక భూసేకరణ నోటిఫికేషన్ సంబంధించి ఎంజాయ్‌మెంట్ సర్వే చేసి రికార్డు నమోదు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జాతీయ రహదారి పెండింగ్ ట్రెంచ్ కటింగ్ పూర్తి చేయాలని, ఎవరికైనా పేమెంట్స్ పెండింగ్ ఉంటే తక్షణం పూర్తి చేయాలని సూచించారు. ఆర్డీవో సురేష్, తహసీల్దార్ సుమన్, ఎంపీడీవో శైలజారాణి, ఎంఈవో కొమురయ్య, ఎంపీవో ఉమేశ్, డాక్టర్ రవిసింగ్, డాక్టర్ ప్రవీణ్, సిహెచ్‌వో భరత్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో వీర బుచ్చయ్య

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వేసవికాలం సమీపిస్తున్న దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య అన్నారు. బుధవారం రాఘవపూర్ రైతువేదికలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. డీపీవో మాట్లాడుతూ కార్యదర్శులు సమయపాలన పాటించాలని, సెగ్రిగేషన్ షెడ్లను సద్వినియోగం చేయాలని, శ్మశాన వాటికలు వినియోగించేకునేలా చర్యలు చేపట్టాలన్నారు. పారిశుధ్యం పట్ల శ్రద్ధ వహించాలని, చెత్తచెదారం లేకుండా చూసుకునే బాధ్యత కార్యదర్శులదేనన్నారు. నర్సరీల్లో మొక్కల రక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. ఇంటి పన్నులు వసూలు చేయాలన్నారు. డీఎల్‌పీవో వేణుగోపాల్, ఎంపీవో ఫయాజ్‌తో పాటు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



గెస్ట్‌హౌస్‌లోకి మార్చిన అగ్రికల్చర్ ఏడీఏ ఆఫీసు

ప్రభుత్వ కార్యాలయాలకు

సొంత భవనాలు కరువు

- అద్దె భవనాల్లో నిర్వహణ
- అరకొర సౌకర్యాలతో ఉద్యోగుల అవస్థలు
- సొంత భవనాల నిర్మాణానికి ఏళ్ల తరబడి నిరీక్షణ

మంథని, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ నియోజకవర్గ, రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఉన్న మంథనిలో పలు ప్రభుత్వ శాఖలకు ఏళ్ళ తరబడి సొంత భవనాలు లేకుండా పోయాయి. వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాల నిర్వాహణను మంథనిలోని ఇతర ప్రభుత్వ శాఖల ఆఫీసు ల్లో, పలు గెస్ట్ హౌజ్‌ల్లో, అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. పలు కీలక శాఖలకు చెందిన కార్యాలయాలకు సొంత భవనాలు లేక అరకొర వసతులతో ఇటు ఉద్యోగులు, అటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఆర్అండ్‌బీ కార్యాలయం : గాంధీచౌక్‌లోని ఆర్అండ్‌బీ డివిజన్ కార్యాలయం ఉద్యోగులు విధులు నిర్వహించలేని విధంగా పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో దాన్ని ఇదే శాఖకు చెందిన ఆర్డీవో ఆఫీసు పక్కన ఉన్న గెస్టహౌజ్‌లోకి మార్చారు. కార్యాలయ నిర్మాణానికి నిధులు రాకపోవడంతో దాదాపు సంవత్సర కాలంగా గెస్టహౌజ్‌లోనే అధికారులు, ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. అన్ని శాఖలకు భవనాలు, రోడ్లు నిర్మించే పని చేసే ఆర్అండ్‌బీ శాఖ కార్యాలయానికే సొంత భవనం లేక, నిర్మాణానికి నిధులు మంజూరు కాక గెస్టహౌజ్‌లో తాత్కాలికంగా కార్యాలయాన్ని నిర్వహించడం గమనార్హం.

వ్యవసాయశాఖ కార్యాలయం: వ్యవసాయ శాఖ డివిజన్, మండల కార్యాలయాలకు సంబంధించిన భవనాలు సైతం ఉద్యోగులు పని చేయటానికి వీలు లేకుండా ఉన్నాయి. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని గెస్టహౌజ్‌లో తాత్కాలికంగా కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకొని అధికారులు, ఉద్యోగులు పని చేస్తున్నారు. నిత్యం వివిధ రకాల సమస్యలతో రైతులు అధికంగా కార్యాలయానికి వచ్చే ప్రధానమైన అగ్రికల్చర్ డిపార్టుమెంట్‌కు సొంత భవనం లేక ఉద్యోగులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ఐసీడీఎస్ కార్యాలయం : స్త్రీ శిశు సంక్షేమ శాఖకు చెందిన ఐసీడీఎస్ సీడీపీవో కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోగా అద్దె భవనాల్లో ఏళ్ళుగా కొనసాగింది. ప్రభుత్వం ఇచ్చే అద్దెకు భవనాలు అందుబాటులో లేక పోవడంతో స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో షాపింగ్, గోదాంల కోసం నిర్మించిన షెటర్స్‌లోకి ఆఫీసును తరలించగా ఉద్యోగులు వాటిలోనే విధులు నిర్వహిస్తున్నారు. ఈశాఖ సైతం నిత్యం సిబ్బంది, ప్రజలు వివిధ పనుల నిమిత్తం అధిక సంఖ్యలో కార్యాలయానికి వస్తుండటంతో సరిపడ సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

నీటి పారుదలశాఖ : నీటిపారుదల శాఖ (ఐబీ) డివిజన్, మండల కార్యాలయాలు సైతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోగా మంత్రి క్యాంపు ఆఫీసు ఆవరణలో ఉన్న వాటిని కొద్ది నెలల క్రితం కూల్చి వేసి సమీపం లోని మహిళా మండలి భవనంలోని రెండు గదుల్లోకి కార్యాలయాన్ని మార్చారు. డివిజన్, మండల ఆఫీసులు కేవలం రెండు గదుల్లోనే నిధు లు నిర్వహించాల్సి రావడంతో ఉద్యోగులు ఇక్కట్లు ఎదుర్కొం టున్నారు.

ఎంఈవో : ఎంఈవో కార్యాలయం కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో అందులో విధులు నిర్వహించడానికి ఉద్యోగులు భయపడుతున్నారు. ఎప్పుడు పెచ్చులు, గోడలు ఊడి పడతాయో తెలియని పరిస్థితి ఉంది. వర్షాకాలం భారీ వర్షాలకు ఎంఈవో ఆఫీసు వరద నీటిలో రోజుల తరబడి ఉంటుంది. దీనికి కూడ పక్కా భవనం లేదు. లేబర్ డిపార్టుమెంట్ డివిజన్ కార్యాలయానికి సైతం సొంత భవనం లేక ఏళ్ళ తరబడి అద్దె భవనంలో కొనసాగుతోంది. ప్రభుత్వం ఇచ్చే అద్దె సరిపోక చిన్న గదుల్లో కార్యాలయాన్ని నెట్టుకొస్తున్నారు. దీంతో ఉద్యోగులు, కార్మికులు అవస్థలు పడుతున్నారు.

ఇలా చాలా కార్యాలయాలు అరకొర సౌకర్యాలు, అద్దె భవనాల్లో ఏళ్ళ తరబడి కొనసాగుతుండటంతో విధులు నిర్వహించడానికి అధికారులు, ఉద్యోగులు, వివిధ పనుల కోసం కార్యాలయాలకు వెళ్ళే ప్రజలు అసౌకర్యాలకు గురవుతున్నారు. కలెక్టరేట్ మాదిరిగా డివిజన్ స్థాయి అన్ని ప్రభుత్వ కార్యాలయాలను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ప్రచారం సాగుతున్నా ఇప్పటి వరకు ఎలాంటి కార్యాచరణకు నోచుకోలేదు. ఇప్పటి కైనా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారులు స్పందించి మంథనిలో అన్ని ప్రభుత్వ శాఖలకు సొంత భవనాలు సౌకర్యాలతో నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు, ప్రజలు కోరుతున్నారు.







గెస్ట్‌హౌస్‌లో కొనసాగుతున్న డివిజన్ ఆర్అండ్‌బీ కార్యాలయం, గోదాం షెటర్‌లో నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో కార్యాలయం, అద్దె భవనంలో ఉన్న లేబర్ ఆఫీసు

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



స్వామి వారి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పెద్దకల్వల క్యాంపులోని అలివేలుమంగ పద్మావతి సమేత లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహోత్సవాల్లో భాగంగా బుధవారం కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ బొంకూరి శంకర్ మాట్లాడుతూ యేటా స్వామి వారి బ్రహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీవల్లి సేవా సంస్థ సభ్యులు కల్యాణ మహోత్సవానికి వచ్చిన భక్తులకు సేవలందించారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కమిటీ సభ్యులు ప్రభాకర్, రాజనరేందర్ గౌడ్, సత్యనారాయణ, రాజ్‌కుమార్, రాకేష్, అనిత, శిల్ప, సౌమ్య, ప్రధాన అర్చకులు భాష్యం రంగాచార్యులు, పవన్‌కుమార్, హరీష్‌కుమార్, శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరుకున్న కలాం యాత్ర



కలాం స్ఫూర్తి యాత్ర వాహనంలో పరిశీలిస్తున్న డీఈవో మాధవి

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం స్ఫూర్తియాత్ర బుధవారం పెద్దపల్లికి చేరుకుంది. విద్యార్థులకు అత్యాధునిక సాంకేతికతను అందించేందుకు పయనిస్తున్న యాత్రలో భాగంగా ఉన్నత పాఠశాలకు చేరింది. విద్యార్థులకు హ్యాండ్స్ ఆన్ లెర్నింగ్ అనుభవాన్ని అందించింది. జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి విద్యార్థులతో మాట్లాడుతూ మారుతున్న సాంకేతికతను వినియోగించుకొని మరింత అభివృద్ధి చెందాలన్నారు. విద్యార్థులు వినూత్న ఆవిష్కరణలతో ఒక లక్ష్యంతో ముందుకు వెళ్లాలన్నారు. ప్రధానోపాధ్యాయులు కె.రామచంద్రం, జిల్లా సైన్స్ అధికారి బి.రవినందర్‌రావు, కరుణశ్రీ, కృష్ణాకర్ పాల్గొన్నారు. విద్యార్థులకు లోట్ ఏఐ 3డి ప్రింటింగ్, రోబోటిక్స్, ఏఆర్, వీఆర్, మెషిన్ లెర్నింగ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రత్యక్షంగా వీక్షించే అవకాశాన్ని కల్పించారు.

ఘనంగా శివాజీ మహరాజ్ జయంతి



శివాజీ జయంతి ఉత్సవాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): అవినీతి, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప యోధుడు శివాజీ మహరాజ్ అని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శివాజీ జయంతి సందర్భంగా బుధవారం సాయంత్రం గోదావరిఖని చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఉత్సవాలలో మాట్లాడారు. రాజ్యస్థాపనకు పాటుపడిన మహానేత శివాజీ అని, ఖని శివాజీనగర్‌లో త్వరలో కాంస్య విగ్రహం ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. బీ పవర్‌హౌస్ వద్ద 108అడుగుల హనుమాన్ విగ్రహ నిర్మాణ పనులు ప్రారంభమైనట్టు తెలిపారు. యువత శివాజీ మహరాజ్ సూచించిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ప్రజలు, యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొంతల రాజేష్, నాయకులు మహంకాళి స్వామి, సుజాత, తిప్పారపు శ్రీనివాస్, దాసరి విజయ్, ఉత్సవ కమిటీ నాయకులు అయోధ్య రవీందర్, ముష్కె సంపత్, తిరుపతి, అడిగొప్పుల రాజు పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీల ధర్నా



ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైఠాయించిన కూలీలు

ఎలిగేడు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఉపాధిహామీ కూలీలు బుధవారం ధర్నా చేశారు. అక్కచెరువులో మట్టి తీసి రైతుల పొలాలకు, రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు అధికారులు కూలీలకు పని కల్పించారు. మూడు రోజులుగా పని చేస్తున్నా కూలీ పడడం లేదని, మట్టితీసే ప్రాంతంలో దుర్గంధం వస్తుందని అధికారులకు తెలిపారు. ఇద్దరు కూలీలు కలిసి ఒక్క ట్రాక్టర్ ట్రిప్పు మట్టి తీస్తే రూ.300 చెల్లిస్తామని అధికారులు చెప్పడంతో కూలీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులను నిలిపివేసి ఎంపీడీవో ఆఫీస్ ఎదుట బైఠాయించారు. ఎంపీడీవో భాస్కర్‌రావు, ఉపాధిహామీ జేఈ రాజ్‌కుమార్‌లు కూలీలకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. చెరువులో మట్టి గట్టిగా ఉందని, 20మంది కూలీలకు 10 ట్రాక్టర్ ట్రిప్పుల మట్టిని తీయాలని చెప్పడం ఎంతవరకు సమంజసమని కూలీలు నిలదీశారు. కూలీలు, అధికారులు, చెరువు వద్దకు వెళ్లి పరిశీలించి మరోచోట పని కల్పించారు. పంచాయతీ కార్యదర్శి అంజలి, టీఏ రంజిత్‌కుమార్, మేట్ అజయ్, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

అమ్మకము

ప్రకాశం జిల్లాలో 370-HITACHI ప్రొక్లైన్స్, 210-HYUNDAI ప్రొక్లైన్స్ with సింగిల్ జాకీ డ్రిల్లింగ్ మెషిన్, CAT WHEEL LOADER (988K), ROCK-BUGGY (డ్రిల్లింగ్ మెషిన్) MAN TIPPERS మరియు DUMPERS (1035) అమ్మకమునకు కలవు. చీమకుర్తి మండలం నందు 4.5 ఎకరాలలో విస్తరించి ఉన్న MVR స్టోన్ క్రషర్స్ (36/30-1no & 30/9-2no) కంకర మిల్లు అమ్మకమునకు కలదు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : 8074432717, 80087 00148

AJG-210361

CHANGE OF SURNAME

★ I," CHEKKABANDI SRINIVAS" S/O. CHEKKABANDI CHENDRA REDDY, R/O. H.NO: 8-6-5/A, ROAD NO-2, KOTHIRAMPOOR, KARIMNAGAR, I HAVE CHANGED MY NAME AS "CHEKKABANDI SRINIVAS REDDY" S/O. CHEKKABANDI CHANDRA REDDY.

AJK-16542

CHANGE OF NAME

★ I, SIRIPURAM NAGA PRASAD S/o PARASHURAM, R/o H.No.2-101/59, Kamanpur Village, Kothapally Mandal, Karimnagar District, Telangana State-505001, have changed the name of my minor son SIRIPURAM VENNU PATEL aged (09) years and he shall hereafter known as SIRIPURAM SAI VEDANSH

AJH-1639

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

కరీంనగర్ :- సెల్: 9703618691, 99854 10640

జగిత్యాల, మెట్‌పల్లి :- సెల్ : 99854 11262

వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063

పెద్దపల్లి :- 95509 00238

కెనాల్‌లో పడి సింగరేణి రిటైర్డు కార్మికుడి మృతి

మంథని, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోచమ్మవాడ సమీపంలోని ఎస్‌ఆర్‌ఎస్‌పీ కెనాల్‌లో ప్రమాదవశాత్తు పడి సింగరేణి రిటైర్డు కార్మికుడు తిప్పనిశంకరయ్య(80) మృతిచెందాడు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కాలనీకి చెందిన శంకరయ్య ఈనెల5న స్వగ్రామమైన ఓదెలకు వెళుతున్నట్లు భార్య మల్లమ్మకు చెప్పి బయలుదేరాడు. ఓదెలకు చేరుకోకపోవడం, ఫోన్ పనిచేయకపోడంతో ఈనెల6న శంకరయ్య కొడుకు తిప్పనిలక్ష్మణ్ నస్పూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బుధవారం ఉదయం కెనాల్‌లో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు స్థానికులు100కు డయల్ చేశారన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్ళి మృతదేహానికి పరిశీలించారన్నారు. శ్రీరాంపూర్‌లో మిస్సింగ్ కేసు నమోదు కాగా శంకరయ్య బంధువులను మంథనికి పిలిపించగా మృతదేహాన్ని పరిశీలించి శంకరయ్యగా గుర్తించారన్నారని ఎస్‌ఐ రమేష్ తెలిపారు. శంకరయ్య మద్యం సేవించి మతి స్థిమితం లేకుండా తిరుగుతాడని, ఈనేపథ్యంలో మండలంలోని ధర్మారం గ్రామంలో బంధువులు ఉండటంతో ఇక్కడి వచ్చి మద్యం సేవించి ప్రమాదవశాత్తు కెనాల్‌లో పడి మృతి చెంది ఉంటాడని తెలిపారు. మృతుడి కొడుకు లక్ష్మణ్ ఫిర్యాదు చేయగా ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

వీణవంక, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన అంబాల వీరమ్మ(91) చలిమంట కాగుతూ చీరకు మంటలంటుకోగా చికిత్సపొందూ మృతిచెందింది. పోలీసులు వివరాల ప్రకారం.. ఈనెల12వతేదీన ఉదయం ఇంటిముందు చలి మంటకాగుతుంగా ప్రమాదవశాత్తు వీరమ్మ చీరకు నిప్పంటుకుంది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే కరీంనగర్ ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు.

అతిగా మద్యం తాగి యువకుడు..

ధర్మపురి, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని పెద్దనక్కలపేట గ్రామానికి చెందిన బండారి భూమేష్(32) అనే యువకుడు అతిగా మద్యంసేవించి మృతిచెందినట్లు ఎస్‌ఐ ఉదయ్ కుమార్ తెలిపారు. బండారి లక్ష్మి అనే మహిళకు కొడుకు, ముగ్గురు కూతుళ్ల ఉండగా కొడుకు భూమేష్ అతిగా మద్యం సేవిస్తుంటాడని తెలిపారు. లక్ష్మి బీర్‌పూర్ జాతరకు వెళ్లి బుధవారం వచ్చి చూసేసరికి కొడుకు భూమేష్ మంచంపై చనిపోయి ఉన్నాడని ఆయన పేర్కొన్నాడు. భూమేష్ అతిగా మద్యం సేవించి తిండి సరిగా తినకపోవడం వల్ల మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఉరివేసుకుని మాజీ జడ్పీటీసీ ఆత్మహత్య


రాజమల్లు (ఫైల్)

వీణవంక, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మాజీ జడ్పీటీసీ ఆనంద రాజమల్లు(72) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థుల కథనం ప్రకారం.. రాజమల్లు కొంతకాలంగా ఆర్థికఇబ్బందులతో బాధపడుతున్నాడు. బుధవారం ఎవరూలేని సమయంలో ఇంట్లో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు. 1997లో టీడీపీ తరపున జడ్పీటీసీగా ఎన్నికయ్యారు. మాజీ మంత్రి ముద్దసాని దామోదర్‌రెడ్డి ముఖ్య అనుచరుడిగా కొనసాగారు.

ఉరివేసుకుని యువకుడు..

ఎలిగేడు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సాపూర్ గ్రామానికిచెందిన యాదగిరి చందు(27)అనే యువకుడు బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎంబీఏ వరకు చదువుకున్న చందు ఏమి పని చేయకుండ ఇంటివద్దనే రెండేళ్లుగా ఉంటున్నాడు. ఏదైన పని చూసుకొమ్మని తరచుగా తల్లిదండ్రులు చెప్పేవారు. ఈక్రమంలో ఫోన్‌లో పరిచయమైన అమ్మాయిని ఎలా పెళ్లి చేసుకుంటావని మందలించారు. అటు ఉద్యోగంలేక ఇటు అమ్మాయిని పెళ్లి చేసుకోలేక ఖాళీగా ఉంటున్నాననే మనస్థాపంతో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు.

అత్యాచారం కేసులో నిందితుడికి 20ఏళ్ల జైలు

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బాలిక (మానసిక వికలాంగురాలు)పై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు వెయ్యి రూపాయలు జరిమానా విధించడంతో పాటు బాధితురాలికి రూ.2లక్షల పరిహారం చెల్లించాలని జిల్లా ప్రధానన్యాయమూర్తి నీలిమ బుధవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం మల్యాల పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన ఓబాలికపై 2021సంవత్సరంలో చెట్‌పెల్లి నారాయణ అలియాస్ టోపి నారాయణ(55) అనేవ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మల్యాల పోలీసులు నారాయణపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ రమణమూర్తి ఆధ్వర్యంలో కేసు విచారణ చేపట్టగా కోర్టు డ్యూటి అధికారులు సరైన సాక్ష్యులను ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టులో ప్రవేశ పెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణా రావుతో పాటు పోలీస్, కోర్టు డ్యూటీ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

భార్య, ఇద్దరు పిల్లల మృతికి కారణమైన భర్త రిమాండ్

పెగడపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): భార్య, ఇద్దరు పిల్లల మృతికి కారణమైన మద్దులపల్లి గ్రామానికిచెందిన కంబాల తిరుపతిని బుధవారం పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెగడపల్లి మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన కంబాల తిరుపతి వేరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తన భార్య హారికను వేధింపులకు గురి చేశాడు. దీంతో హారిక పిల్లలకు పురుగుల మందు ఇచ్చి ఆమె కూడా తాగి మృతి చెందింది. ముగ్గురి మృతికి కారణమైన తిరుపతిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ సీహెచ్ రవికిరణ్ తెలిపారు.

సెల్‌ఫోన్ హ్యాక్‌పై సైబర్‌క్రైంకు ఫిర్యాదు

మంథని, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నఓదాల గ్రామానికి చెందిన చిట్టవేన హరీష్ సెల్‌ఫోన్ హ్యాక్ కాగా మంథని పోలీసులతో పాటు సైబర్ క్రైం పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. మంథనికి వచ్చిన అతనుఫోన్‌లో వాట్సాప్ ఓపెన్ చేయడంతో చాలా మందికి అతడి వాట్సప్ ద్వారా అశ్లీల చిత్రాలు వెళ్ళాయి. వారు ఫోన్‌చేసి ఈవిషయాన్ని చెప్పడంతో తన ఫోన్ హ్యాక్ అయినట్లు ఆందోళనకు గురై పోలీసుస్టేషన్‌కు వెళ్ళి ఫిర్యాదు చేశాడు. వారి సూచనమేరకు సైబర్ క్రైం 1930 నెంబర్ ద్వారా ఫిర్యాదు చేసి తన సిమ్ బ్లాక్ చేసినట్లు తెలిపారు.

దొంగల పట్టివేత

ధర్మపురి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో చిల్లర సామాన్లు దొంగతనం చేసిన ఐదురుగు మహిళలను స్థానికులు బుధవారం పట్టుకున్నారు. చొప్పదండి మండలానికి చెందిన ఐదుగురు మహిళలు గ్రామాల్లో చెత్త సామాన్లు, కాగితాలు సేకరించి బయట విక్రయిస్తుంటారు. అదే సమయంలో తిమ్మాపూర్ గ్రామంలోని పలు ఇళ్లలో చొరబడి స్టీల్, ఇత్తడి బిందెలు, ప్లేట్స్, చెంబులు, గ్లాసులు దొంగిలించారు. వెంటనే గ్రామస్థులు సదరు మహిళలను పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

ఆల్‌రౌండర్ అనిల్

సింగర్‌గా, డైరెక్టర్‌గా, యాక్టర్‌గా, రైటర్‌గా రాణిస్తున్న కథలాపూర్ యువకుడు

పదేళ్లుగా యూట్యూబ్‌లో సందడి

60 వేల మంది సబ్‌స్క్రైబర్లు


పాట పాడుతున్న అనిల్ పల్ల

కథలాపూర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో పరుచుకున్న అందాలు.. గ్రామీణ యువత మనసులోని మధురానుభూతులు..ఆధ్యాత్మిక భావాలను పెంపొందించే పదాలే ఆ యువకుడి కథా వస్తువులు. కథలాపూర్ మండలం దూలూరుకు చెందిన అనిల్ పల్ల అనే యువకుడు సింగర్‌గా, డైరెక్టర్‌గా, యాక్టర్‌గా, రైటర్‌గా రాణిస్తున్నాడు. పదేళ్లుగా అతడి పాటలు యూట్యూబ్‌లో సందడి చేస్తున్నాయి. సమ్మక్క- సారలమ్మ, బతుకమ్మ పండగ ప్రాశస్త్యాన్ని పాటలుగా రాయడమే కాకుండా కెమెరాలో బంధించి 60 వేల మంది సబ్‌స్క్రైబర్లను సంపాదించాడు.



అనిల్ నటించి, దర్శకత్వం వహిస్తున్న ఆల్బం

సీఎస్ క్రియేషన్స్ ఫిల్మ్ ప్రొడక్షన్ ఏర్పాటు

2015లో సీఎస్ క్రియేషన్స్ ఫిల్మ్ ప్రొడక్షన్ సంస్థను స్థాపించిన అనిల్ సొంతంగా పాట రాసి స్వీయ దర్శకత్వంలో వీడియో చిత్రీకరించి రైతు పాట పేరిట మొదటిసారిగా యూట్యూబ్ లో అప్‌లోడ్ చేశాడు. దీంతో అనేక మంది ఆ పాటను అభినందించారు. సుడా సక్కని పిలగా, మనసులో తెరచాటుగా, సినసిన సింతల్లారా, బతుకమ్మ, సమ్మక్క, సారలక్క, వానల్లో వరదల్లో చినుకుల్లో వంటి జానపద పాటలను నటీనటులతో కలిసి వీడియోలు రూపొందించాడు. పల్లెటూరు యువతలో దాగి ఉన్న కళను బయటకు తీసే ప్రయత్నం చేశాడు.

భజరంగ్ మూవీ మేకర్స్‌తో సినిమాలు

వీడియో పాటలకు వెల్లువలా వస్తున్న కామెంట్లతో తన ప్రతిభకు మరింత పదును పెట్టాలనే యోచనతో భజరంగ్ మూవీ మేకర్స్ పేరిట సినిమాలు తీయాలని సంకల్పించాడు. అరాచకం, మరిచి పోతున్న కన్నయ్యా అనే సినిమాలు పోస్ట్ ప్రొడక్షన్‌లో ఉన్నాయి.

బాల్యం నుంచి పాటలంటే ఇష్టం

అనిల్ పల్ల, కళాకారుడు

పల్లె ప్రజల జీవన శైలి నేపథ్యంతోనే పాటలు రాయాలని చిన్ననాటి నుంచి ఆసక్తి ఉండేది. భీమారం మండలం ఈదుల లింగంపేట పాఠశాలలో చదువుకునే రోజుల్లో నేను పాడిన పాట విని గురువులు అభినందించారు. జిల్లాస్థాయి పాటల పోటీల్లో గెలుపొంది వేములవాడలోని సినారే కళాభవన్‌లో సినారే చేతుల మీదుగా బహుమతి పొందడం నాలో మరింత ఆసక్తిని పెంచింది. ప్రస్తుతం కథలాపూర్‌లో స్టూడియో ఏర్పాటు చేసుకొని పాటలు రాస్తూ, గానం చేస్తూ, దర్శకత్వం, డబ్బింగ్, కాస్ట్యూమ్, ఎడిటింగ్ వంటి పనులన్నీ చేసుకుంటున్నా. యూట్యూబ్‌లో 60 వేల మంది సబ్‌స్క్రైబర్లు ఉండడం చాలా సంతోషంగా ఉంది.

మైసమ్మ ఆలయంలో చోరీ..

ముస్తాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) :ముస్తాబాద్ మండలకేంద్రంలోని పులి శేరుకుంట కట్టపైగల మైసమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి జరిగిందని ఆలయ కమిటీచైర్మన్ బద్దిపడిగె ప్రతాపరెడ్డి తెలిపారు. ఆలయంలో ఏర్పాటు చేసిన రూ12 వేలవిలువచేసే గంటతో పాటు హుండీలోని డబ్బులను దొంగలు దొంగిలించారన్నారు. గతంలో సైతం ఇలాగే చోరీ జరిగిందని వాపోయారు. స్థానిక పోలీసుకు ఫిర్యాదు చేస్తున్నట్లు ప్రతాపరెడ్డి, పుల్లూరి రవిలు వివరించారు.

పేకాట కేంద్రంపై పోలీసుల దాడి

ఓదెల, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారు హరిపురం రోడ్డు వైపు బుధవారం పోలీసులు పేకాటకేంద్రంపై దాడిచేశారు. ఎస్సై రమేష్ మాట్లాడుతూ ఓదెలకు చెందిన కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లిదాడి చేశామని తెలిపారు. తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.రూ.7,100, మూడు సెల్‌ఫోన్లు, నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పేకాటలు, కోడిపందేలు, బెట్టింగులు లాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కానిస్టేబుళ్ళు రాజేందర్, ప్రశాంత్, రామకృష్ణ పాల్గొన్నారు. తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు పొత్కపల్లి ఎస్సై దీకొండ రమేష్ తెలిపారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

● 103 గ్రాములు బంగారం స్వాధీనం


నిందితుడి అరెస్ట్ చూపుతున్న మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పలు జిల్లాల్లో చోరీలకు పాల్పడుతున్న ఘరానా దొంగ మిట్టపల్లి లక్ష్మణ్ అలియాస్ రవి అలియాస్ విజయ్‌ని మల్లాపూర్ మండలం ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ వద్ద అరెస్ట్‌చేశారు. మెట్‌పల్లి సీఐ నిరంజన్ రెడ్డి బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నిర్మల్ జిల్లా భైంసా పట్టణానికి చెందిన మిట్టపల్లి లక్ష్మణ్ కొద్ది సంవత్సరాలుగా ఉమ్మడికరీంనగర్, నిజామాబాద్, మహబూబ్ నగర్ జిల్లాల్లో తాళం వేసిన ఇళ్లను గుర్తించి బంగారం, వెండి ఆభరణాలను దొంగిలించేవాడని అన్నారు. నిందితుడిపై 40కేసులు ఉండగా 28కేసులు కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 12 కేసులలో జైలు శిక్ష విధించిందని పేర్కొన్నారు. గత ఏడాది బెయిల్ మీద వచ్చి మల్లాపూర్ మండలం ముత్యంపేట, సిర్పూర్, మేడిపల్లి మండలం దమ్మన్నపేట గ్రామలలో చోరీ పాల్పడ్డాడని తెలిపారు. మంగళవారం సాయంత్రం మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామ శివారులోని చక్కెర ఫ్యాక్టరీ వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా లక్ష్మణ్ అను మానస్పదంగా కనిపించగా అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. దీంతో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు నేరం ఒప్పుకోవడంతో అతని వద్ద నుంచి 103 గ్రాములు బంగారం, 125 గ్రాముల వెండి, ఒక బైక్‌స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితుడిపై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దొంగను పట్టుకోవడంలో చాకచక్యం వ్యవహరించిన మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డిని, మల్లాపూర్ ఎస్‌ఐ రాజులు, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, డీఎస్పీ రాములు అభినందించారు.

వృత్తి కూలి పని.. ప్రవృత్తి గంజాయి సాగు

- సిరిసిల్ల మెడికల్ కళాశాల నిర్మాణ ప్రదేశంలో గంజాయి మొక్కల పెంపకం
- ఒడిశా, పశ్చిమ బెంగాల్ వలస కూలీల గుట్టురట్టు చేసిన పోలీసులు
- జిల్లా వ్యాప్తంగా ఏడాదిలో 2.2 కిలోల గంజాయి సీజ్.. 48 మంది అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లకు వలస వచ్చిన ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన ఆరుగురు పని చేసే ప్రదేశంలోనే గంజాయి సాగు చేశారు. వారిని వారంరోజుల క్రితం పోలీసులు పట్టుకున్నారు. జిల్లావ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు చేశారు. నార్కోటిక్ జాగిలాలతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఏడాదిలో గంజాయి అక్రమ రవాణా, సాగుచేస్తున్న, తాగుతున్న 48మందిని అరెస్ట్ చేశారు. వారినుంచి 2.2కిలోల గ్రాముల గంజాయిని పోలీసులు సీజ్ చేశారు.

● గంజాయి సాగులో కొత్తకోణం..

గంజాయి సాగులో కొత్త కోణం వెలుగు చూసింది. తమపై ఎవరి దృష్టిపడదని భావించిన వలస కూలీలు సిరిసిల్ల మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులు చేస్తూ అక్కడే గంజాయి మొక్కల పెంపకం చేపట్టారు. విషయం తెలుసుకున్న సిరిసిల్ల పోలీసులు ఈ వ్యవహారాన్ని గుట్టురట్టు చేశారు. సిరిసిల్ల పట్టణం బైపాస్ రోడ్డులో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు జరుగు తున్నాయి. ఒడిశా రాష్ట్రానికి చెందిన దేబ్రట్ ధాలి, మాలే మాలిక్ సెంట్రింగ్ పని చేసు కుంటూ పక్కనే షెడ్డులో ఉంటున్నారు. పక్కనే ఉన్న భూమిలో గంజాయి విత్తనాలు చల్లి మొక్కల పెంపకం చేపట్టారు. పెరిగిన ఆకులను తెంపి ఎండబెట్టి గంజాయిని తయారుచేస్తున్నారు.


వలసకూలీలు సాగు చేసిన గంజాయి మొక్కలు(ఫైల్)

● ఆరుగురు కటకటాలపాలు

గంజాయి సాగుచేస్తూ, సేవిస్తున్న ఆరుగురు వలస కూలీలు కటకటాలపాలయ్యారు. ఒడిశాకు చెందిన దేబ్రట్ ధాలి, మాలే మాలిక్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రణబ్ సింఘా, సాగర్ సర్కార్, జిబాన్ బిశ్వాస్, రంజీవ్ సింఘాను పోలీసులు అరెస్టు చేశారు. దాదాపు 5.2 లక్షల రూపాయల విలువైన 52గంజాయి మొక్కలను తొలగించి ధ్వంసం చేశారు. ఆరుగురు వలసకూలీలను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపి 50గ్రాముల ఎండిన గంజాయి, రెండు గంజాయి తాగే పైపులను పోలీసులు సీజ్ చేశారు. ఈ విషయం సిరిసిల్లలో చర్చనీయాంశమైంది.



● గంజాయి రవాణాపై ఉక్కుపాదం
- అఖిల్ మహజన్, ఎస్పీ

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాం. గంజాయి రహిత జిల్లాగా మార్చడానికి కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తూ నార్కోటిక్ జాగిలాలతో తనిఖీలు చేస్తూ గంజాయి అక్రమ రవాణాను అరికడుతున్నాం. గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్నవారిపై నిఘా పెట్టి గంజాయి కిట్ల సహాయంతో యూరిన్ టెస్టులు నిర్వహించి సేవించే వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తున్నాం. గంజాయికి అలవాటు పడిన వారికి డీఅడిక్షన్ సెంటర్‌లో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నాం. గంజాయి విక్రయించినా, సాగు చేసినా, రవాణా చేసినట్లు తెలిస్తే వెంటనే 8712656392 నంబర్‌కు సమాచారం అందిస్తే కఠినచర్యలు తీసుకుంటాం.

దాడికి పాల్పడిన భార్యాభర్తలపై కేసు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇంటిపక్కన గోడ విషయంలో దాడికిదిగి గాయపరిచిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్ గ్రామానికి చెందిన భార్యభర్తలు భీమరి రేణ, నర్సింలుపై కేసు నమోదుచేశామని ఎస్సై రమాకాంత్ బుధవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామంలోని భీమరి అంజయ్య తన ఇంటిస్థలంలో పక్కనే ఉన్న సోదరుడు నర్సింలు ఇల్లు కనిపించకుండా గోడను నిర్మించాడు. అడ్డుగా ఉన్న గోడను నర్సింలు తొలగించడంతో ఈనెల 18న ఇదేమిటని అంజయ్య ప్రశ్నించాడు. దాంతో కోపోద్రిక్తుడైన నర్సింలు తన ఇంటిలోని కొడవలిని తీసుకొని వచ్చి అంజయ్యపై దాడికి దిగాడు. అడ్డుగా వెళ్లిన అంజయ్య భార్య మనెవ్వ, కొడుకు అభిలాష్‌లను రోకలిబండతో దాడిచేశాడు. ఈ క్రమంలో నర్సింలు, అతని భార్య రేణ అసభ్యపదజాలంతో దూషిస్తూ విచక్షణారహితంగా చితకబాదారు. బాధితుడు అభిలాష్ ఫిర్యాదు మేరకు భార్యాభర్తలు రేణ, నర్సింలుపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై రమాకాంత్ వివరించారు.

అసత్య ప్రచారం చేసిన యువకుడిపై..

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అధికారులపై అసత్య ప్రచారంచేసిన కందికట్కూర్ గ్రామానికి చెందిన తాళ్లపల్లి శశిధర్‌గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ వాట్సాప్ గ్రూపులో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా, పోలీసు అధికారులతో పరిచయాలు ఉన్నాయంటూ ప్రచారం చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రజలను రెచ్చగొట్టే విధంగా ఎవరు తప్పుడు ప్రచారం చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అధికారులను కించపరిచే పోస్టులు పెట్టిన ఇద్దరిపై..

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా అధికారులను కించపరిచే విధంగా సోషల్‌మీడియా వేదికగా పోస్టులు చేసిన గుండారపు గణేశ్, ఆకుల శ్రీనివాస్‌రెడ్డిలపై బుధవారం కేసులు నమోదు చేశామని సిరిసిల్ల టౌన్‌సీఐ కె కృష్ణ తెలిపారు. వీరితో పాటు మరికొందరిపై కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లా అధికారుల గురించి, వారి వ్యక్తిగత విషయాలకు సంబంధించిన అసభ్యకర పోస్టులు పెడితే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. అధికారులు, ఇతరులను కించపరిచే విధంగా, మనోభావాలు దెబ్బతినే విధంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేసిన వారిపై, గ్రూప్ అడ్మిన్‌లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

ద్విచక్ర వాహనాలు, సైకిళ్లు దగ్ధం

మల్లాపూర్, ఫిబ్రవరి, 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్టాపూర్‌గ్రామంలోని ఓ మెకానిక్ షెడ్‌లో రెండు బైక్‌లు, పలుసైకిళ్ల దగ్ధమైనట్లు బుధవారం గ్రామ స్థులు తెలిపారు. వారికథనం ప్రకారం గ్రామంలోని మెకానిక్‌షెడ్డు వద్ద మరమ్మతుల నిమిత్తం ఉన్న వాహనాలు, సైకిళ్ల కాలిపోయాన్నారు. ఏదైనాప్రమాదం జరిగిందా లేకఎవరైనా చేశారా అనే అనుమానాలను వ్యక్తం చేశారు.

12 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

ముస్తాబాద్, ఫిబ్రవరి 19(ఫిబ్రవరి):మండలంలోని మోర్రాయిపల్లెశివారులో 12 క్వింటాళ్లరేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపారు. ముస్తాబాద్‌కు చెందిన ఆనరాశి శేఖర్, గంధ సత్యనారాయణ గ్రామాలలో తిరుగుతూ సేకరించిన పీడీఎస్ బియ్యాన్ని అధికధరకు డొక్క ప్రవీణ్‌కు అమ్మడానికి నిర్ణయించారన్నారు. మోర్రాయిపల్లె శివారులో నిల్వఉంచిన పీడీఎస్ బియ్యాన్ని ద్విచక్రవాహనంపై తరలిస్తుండగాపట్టుకున్నట్లు తెలిపారు. బియ్యం స్వాధీనంచేసు కొని కేసు దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

శంకరపట్నం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టు శివారులో కరీంనగర్-వరంగల్ జాతీయరహదారిపై బుధవారం రాత్రి లారీ, బైక్ ఢీకొన్నఘటనలో ఓయువకుడు దుర్మరణం చెందాడు. స్థానికుల సమాచారం మేరకు.. వీణవంక మండలం బేతిగల్ గ్రామానికి చెందిన ముద్దమల్ల హరీస్(23) లారీ బైక్ ఢీ కొన్న ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ కొత్తపల్లి రవి సంఘటన స్థలానికి చేరుకొని మృతికి సంబంధించి వివరాల సేకరిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

గొల్లపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండల కేంద్రంలోని నల్లగుట్ట సమీపంలోని సర్వే నెం.544లోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టి తవ్వడమే కాకుండా, అడ్డుకోవడానికి వచ్చిన రెవెన్యూ అధికారుల విధులకు ఆటంకం కల్గించిన ఒడ్డె రవి అనే వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రవిపై కేసు నమోదు చేశామన్నారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

లింగంపేటలో 2500 కోళ్లు మృతి

● ఆలస్యంగా వెలుగులోకి

చందుర్తి, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగంపేటలో అంతుచిక్కని వ్యాధితో 2500 కోళ్లు మృత్యువాత పడ్డాయి. వారం రోజుల క్రితం ఈ సంఘటన జరగగా, ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామంలో రమేష్‌రావుకు చెందిన పౌల్ట్రీఫామ్‌లో వారంక్రితం మూడు రోజుల్లో 2500 కోళ్లు మృత్యువాతపడ్డాయి. దీంతో వాటిని ట్రాక్టర్‌లో గ్రామానికి దూరంగా తీసుకెళ్లి గోతి తీసి పూడ్చివేశాన ని, కోళ్ల మృతితో నాలుగు లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు రైతు రమేష్‌రావు వాపోయాడు. కాగా, గురువారం గ్రామాన్ని సందర్శించి శాంపిల్స్ సేకరించనున్నట్లు మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి శ్రీధర్ తెలిపారు.


ట్రాక్టర్‌లో మృతి చెందిన కోళ్లు(ఫైల్)

క్రీడారంగంలో నంబర్‌వన్‌గా నిలుపుతాం

● తెలంగాణ ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి


మాట్లాడుతున్న పి మల్లారెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రీడలను ప్రమోట్ చేసేందుకు ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో ఏటా స్పోర్ట్స్ ఒలింపియాడ్ నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నామని, క్రీడా రంగంలో తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిపేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్రఒలింపిక్ సంఘం ప్రధానకార్యదర్శి పి మల్లారెడ్డి అన్నారు. బుధవారం కరీంనగర్‌లో నిర్వహించిన తెలంగాణ జూడో అసోసియేషన్ సమావేశానికి హాజరయ్యారు. అంతకుముందు విలేకరులతో మాట్లాడారు. ఒలింపిక్ సంఘంలో గుర్తింపు ఉన్న సంఘాలకు మాత్రమే ప్రాతినిధ్యం ఉంటుందని, అక్రమపద్ధతుల్లో ఏర్పడే సంఘాలకు మనుగడ లేదని అన్నారు. ఇటీవల ఒలింపిక్ సంఘం నూతన కార్యవర్గం ఏర్పటైందని, ఏర్పాటైన కొద్ది నెలల్లోనే తెలంగాణలో ఎన్నో మార్పులు తీసుకొచ్చామని తెలిపారు. ఉత్తరాఖండ్‌లో జరిగిన 38వ జాతీయ క్రీడల సందర్భంగా తెలంగాణ అథ్లెట్లకు డీఏ రూ.250 నుంచి రూ.500 పెంచేలా కషిచేసినట్లు చెప్పారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు గతంలో వరుసగా రూ.5లక్షలు, రూ.3లక్షలు ఇవ్వగా, ఈ సంవత్సరం నుంచి రూ.10లక్షలు, రూ.7లక్షలు, రూ.5లక్షలు ఇచ్చేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. 2026లో తెలంగాణలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణకు తెలంగాణ ఒలింపిక్ సంఘం కృషి చేసినట్లు చెప్పారు. క్రీడాసంఘాల మధ్య ఏర్పడుతున్న విభేదాలను పరిశీలించనున్నామని, అన్ని క్రీడాసంఘాలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ యూనివర్సిటీతోపాటు క్రీడలకు 370కోట్ల రూపాయలు కేటాయించడం అభినందనీయమన్నారు.

తెలంగాణలో జూడో క్రీడాభివృద్ధికి కృషి

● శాసనమండలి డిప్యూటీచైర్మన్, తెలంగాణ జూడో సంఘం చైర్మన్ బండ ప్రకాశ్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర జూడో సంఘం చైర్మన్ బండ ప్రకాశ్

కరీంనగర్ స్పోర్ట్స్ ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ వ్యాప్తంగా జూడో క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని శాసనమండలి డిప్యూటీ చైర్మన్, తెలంగాణ జూడో అసోసియేషన్ చైర్మన్ బండ ప్రకాశ్ అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని హోటల్ మైత్రీలో తెలంగాణ జూడో అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో జూడో క్రీడాకారులకు కొదవలేదని, భవిష్యత్‌లో ఒలంపిక్‌స్థాయికి ఎదగాలన్నారు. 38వజాతీయస్థాయి క్రీడల్లో తెలంగాణ జూడోక్రీడకారులు అద్వితీయ ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. ప్రతీ ఒక్కరు జూడోలో శిక్షణ తీసుకోవాలన్నారు. తెలంగాణ జూడో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బండ రాజ్‌కుమార్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ జూడో క్రీడకు సంబంధించి త్వరలోనే అకాడమీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.జూడో అసోసియేషన్ కోశాధికారి మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● తెలంగాణ రాష్ట్ర జూడో అసోసియేషన్ ఎన్నిక

తెలంగాణ రాష్ట్ర జూడో అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా వరంగల్ జిల్లాకు చెందిన బండ రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కరీంనగర్‌కు చెందిన గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కడారి అనంతరెడ్డి (కరీంనగర్), పబ్బతి బాలరాజు(యాదాద్రి భువనగిరి), బాదినేని రాజేందర్‌రెడ్డి(జగిత్యాల), మాటేటి సంజీవ్‌కుమార్(పెద్దపల్లి), సంయుక్త కార్యదర్శులుగా రాయిరెడ్డి శంకర్‌రెడ్డి(సిద్దిపేట), సిలివేరి మహేందర్(పెద్దపల్లి), తిప్పారపు సత్యనారాయణ (రాజన్న సిరిసిల్ల), చందనగిరి నాగరాజు(వరంగల్), కోశాధికారిగా రాయిరెడ్డి మహేందర్ రెడ్డి(సిద్ధిపేట), కార్యవర్గ సభ్యులుగా ఎ సాయిచరణ్(ఆదిలాబాద్), ధైసాయి కిరణ్(నిర్మల్), కెతిరుపతిగౌడ్(రాజన్నసిరిసిల్ల), కెరాకేష్ (ఆసిఫాబాద్), ఎ రమేశ్‌రెడ్డి(మంచిర్యాల), ఎం శ్రీనివాస్(జగిత్యాల) ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంతో తెలంగాణ జూడో సంఘానికి చైర్మన్‌గా తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి జాయ్ వర్గీస్ కె, తెలంగాణ ఒలంపిక్ సంఘం నుంచి పి.మల్లారెడ్డి, తెలంగాణ రాష్ట్ర క్రీడాప్రాధికారిక సంస్థ నుంచి వి.శ్రీనివాస్ ఎన్నికల పరిశీలకులుగా హాజరయ్యారు. నూతన కార్యవర్గం నాలుగేళ్లపాటు పనిచేస్తుందని ఎన్నికల అధికారి ఎన్.పరమేశ్వర్ ప్రకటించారు.

బీజేపీకి సవాల్..





● పట్టభద్రులు, ఉపాధ్యాయ స్థానాల్లో గట్టి పోటీ
● కేంద్రమంత్రి సంజయ్ సారథ్యంలో ప్రయత్నాలు
● ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ఎనిమిది మంది ఎంపీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలను గెలిపించుకున్న బీజేపీ వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి రాష్ట్రంలో అధికారం కైవసం చేసుకోవాలని ప్రణాళికా బద్ధంగా వ్యవహరిస్తున్నది. రాష్ట్రంలో జరుగుతున్న కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలు, ఉపాధ్యాయ స్థానం గెలుచుకోవడం ద్వారా రాష్ట్రంలోని విద్యావంతులందరూ బీజేపీ వైపే చూస్తున్నారని సంకేతాలివ్వడానికి తహతహలా డుతోంది. బీజేపీకి చెందిన ఏడుగురు ఎమ్మెల్యేలు, నలుగురు ఎంపీలు కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో గెలిచినవారే కావడంతో ఈ రెండు స్థానాలను గెలుచుకోవడం ఆ పార్టీకి అత్యంత అవసరంగా మారింది. ఈ ప్రాంతంలో తమకు ఆదరణ ఉందని నిరూపించుకోవడానికి ఈ ఎన్నికల విజయం దోహదపడుతుందని భావిస్తున్నారు. లేకపోతే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో దీని ప్రభావం ఉంటుందని ఆ పార్టీ భావిస్తున్నది. ఈ కారణంగా ఈ పట్టభద్రుల, ఉపాధ్యాయ స్థానాలలో గెలుపును సవాల్‌గా తీసుకుంటున్నది.

50 మంది ఓటర్లుకు ఒక బాధ్యుడు



కాంగ్రెస్‌పార్టీ కంటే ముందుగానే అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ ప్రచారంలో కొంత వెనుకబడినా ఇప్పుడిప్పుడే క్షేత్ర స్థాయిలో ప్రత్యేక కార్యాచరణతో కదులుతోంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో చిన్న మైల్ అంజిరెడ్డిని, ఉపాధ్యాయ స్థానంలో మల్క కొమురయ్యను అభ్యర్థులుగా రంగంలోకి దింపింది. కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్, ఎంపీలు ధర్మపురి అరవింద్, రఘునందన్ రావు, గోడెం నగేశ్, ఎమ్మెల్యేలు వెంకట రమణారెడ్డి, ధన్‌పాల్‌సింగ్, రాకేశ్‌రెడ్డి, రామారావు పటేల్, మహేశ్వర్‌రెడ్డి, పాయల్ శంకర్, డాక్టర్ హరీష్‌తో పాటు ముఖ్యనాయకులను, క్రియాశీలంగా వ్యవహరించే నేతలకు గెలుపు బాధ్యతలను అప్పగించింది. ఇప్పటికే ఆ పార్టీ శ్రేణులు నియోజకవర్గ పరిధిలో ఉన్న పట్టభద్రుల స్థానంలో, ఉపాధ్యాయ స్థానంలో ఉన్న ఓటర్లను బూత్ స్థాయిలో గుర్తించి వారి ఫోన్ నెంబర్లతో సహా వివరాలను సేకరించి నమోదు చేసుకున్నారు. 25 నుంచి 50 మంది ఓటర్లకు ఒక బాధ్యుడిని నియమించి అతని ద్వారానే ఓటు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నది. పార్టీ ప్రచార బాధ్యతను ఓటరును సానుకూల పరిచి పోలింగ్ బూత్‌కు తీసుకువచ్చి ఓటు వేయించే బాధ్యతను ఆయా గ్రామ శ్రేణులకు అప్పగించారు.

ఆత్మీయ సమ్మేళనాలు, సోషల్ మీడియా వారియర్స్ సమావేశాలు



అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో ఇప్పటికే ఆత్మీయ సమ్మేళనాలు, సోషల్ మీడియా వారియర్స్ సమావేశాలు నిర్వహించి అనుసరించవలసిన విధానాలను వివరించారు. మండల స్థాయిలో ఓటర్ల సమావే శాలు కూడా ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచన చేస్తున్నట్లు సమా చారం. కాంగ్రెస్ పార్టీ కూడా ఓటర్లను కలువడానికి ఇదే విధానాలను అవలం బిస్తుండడంతో పోటాపోటీ వాతావరణం నెలకొంటు న్నది. కేంద్రమంత్రితోపాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిని ఆశిస్తున్న నేతలు ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండడంతో ఇక్కడి గెలుపు వారందరికి సవాల్‌గా మారింది.

ప్రచారానికి దూరంగా సీనియర్లు

కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహతోపాటు 23 మంది ఎమ్మెల్యేలు కూడా పట్టభద్రుల కాంగ్రెస్ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి విజయం కోసం కృషిచేస్తున్నారు. దీంతో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు ప్రతిష్ఠాత్మక పోటీ సాగుతున్నదనే చర్చ జరుగుతున్నది. 2019లో జరిగిన ఎన్నికల్లో పట్టభద్రుల స్థానంలో పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి సుగుణాకర్‌రావుకు 15,077 ఓట్లు పోలయ్యాయి. ఆయన అప్పుడు మూడో స్థానంలో ఉండగా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన మాజీ మంత్రి జీవన్‌రెడ్డి 56,698 ఓట్లు సాధించి గెలుపొందారు. ఇప్పుడు ఆశావహులు పోటాపోటీగా ఓటర్ల నమోదు కార్యక్రమం చేపట్టిన ఫలితంగా 3,55,159 మంది పట్టభద్రులు ఓటర్లుగా ఉన్నారు. 27,088 మంది ఉపాధ్యాయ ఓటర్లుగా ఉన్నారు.

ఇక్కడి నుంచి బీజేపీ అభ్యర్థులుగా పోటీ చేయడానికి కరీంనగర్‌కు చెందిన కిసాన్ మోర్చా మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి పి సుగుణాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, మంచిర్యాలకు చెందిన రఘునాథ్‌రావు ప్రయత్నాలు చేశారు. పార్టీ పట్టభద్రుల అభ్యర్థిగా అంజిరెడ్డిని తెరపైకి తెచ్చింది. సుగుణాకర్‌రావు, రామకృష్ణారెడ్డి ఇప్పటి వరకు ఎక్కడా పార్టీ అభ్యర్థికి అనుకూలంగా ప్రచారంలో కనిపించడం లేదు. వారు అభ్యర్థి ఎంపిక విషయంలో అసంతృప్తితో ఉన్నారని ప్రచారం జరుగుతున్నది. కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ అభ్యర్థి గెలుపు బాధ్యతను తీసుకోవడం, పార్టీకి అనుబంధంగా ఉండే పలు విభాగాలు, సంస్థలు అంకిత భావంతో పనిచేసేతత్వంగల నాయకులు, కార్యకర్తలు ఉండడం పార్టీ ఆలోచనపరులు వేరే వారికి ఓటు వేసే అవకాశం లేక పోవడం పార్టీ అభ్యర్థికి కలిసివచ్చే అంశాలుగా నిలుస్తున్నాయి. ఉపాధ్యాయ స్థానంలో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య ఒక్కరే రాజకీయ అభ్యర్థి కావడం గమనార్హం. మిగతావారంతా ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పోటీలో ఉన్నారు. ఈరెండు స్థానాలను పక్కాగా సాధించుకుంటామనే ధీమాతో బీజేపీ వ్యవహరిస్తుండగా, అధికార కాంగ్రెస్‌పార్టీ కూడా అంతే ధీమాను ప్రదర్శిస్తుండడం ఆసక్తికరంగా మారింది.

కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలి

● ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి


నూతన కార్యవర్గ సభ్యులతో రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): విద్యను కాషాయీకరణ, ప్రైవేటీకరణ చేసే కేంద్ర ప్రభుత్వ కుట్రలను విద్యార్థులు తిప్పికొట్టాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం కార్మికభవనంలో ఏఐఎస్ఎఫ్ జిల్లాస్థాయి సర్వసభ్య సమావేశం కుర్ర రాకేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి మాట్లాడారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానం, యూజీసీ ప్రతిపాదనలతో విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసే కుట్రలను విద్యార్థులు తిప్పికొట్టాలన్నారు. రాష్ట్రబడ్జెట్‌లో ప్రభుత్వం విద్యారంగ హామీల అమలుకు నిధులను కేటాయించాలని అన్నారు. తెలంగాణలో నూతన ప్రభుత్వ ఏర్పడి సంవత్సరం గడుసున్నా విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో ఉన్న గురుకులాలకు పక్కా భవనాలు ఏర్పాటు చేయాలని, కేజీబీవీ పాఠశాలలో మౌళిక వసతులు కల్పించాలని పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా నూతన కార్యవర్గంకు ఎన్నికలు జరగాయి. జిల్లా అధ్యక్షుడు కుర్ర రాకేష్, కార్యదర్శి మంద అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు పెండెల ఆదిత్య, మల్యాల శ్రీజా, పుట్టి సాత్విక్, సహాయ కార్యదర్శులు మల్లమరి జాషావా, పెంట భరత్, కే శ్రీనివాస్, 12 మంది కమిటి సభ్యులను ఎన్నుకున్నారు.

కుల గణన పేరుతో బీసీలను తగ్గించేందుకు కుట్ర

● ఉపాధ్యాయుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తోన్న కాంగ్రెస్ సర్కార్
● కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్


మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, పక్కన అభివాదం చేస్తున్న టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య, పాల్గొన్న తపస్ నాయకులు

భగత్‌నగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కుల గణన పేరుతో 60లక్షలమంది బీసీలను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. కరీంనగర్‌లో తపస్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ ఫిరాయించిన పదిమంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడటం తథ్యమన్నారు. పదిసీట్లలో ఉపఎన్ని కలువస్తే ఏడింటిలో బీజేపీ గెలువడం ఖాయమన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందు దొందేనని విమర్శించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలల్లో అసమ్మతి రగులుతోందని, కొందరు రహస్యంగా సమావేశాలు నిర్వహిస్తున్నారన్నారు. హిందూజాతిలో ముస్లింలను ఎలా కలుపుతారని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ముస్లింలకు నాలుగుశాతం ఇస్తేనే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీసీలు గెలువాల్సిన స్థానాల్లో ఎంఐఎం గెలిచిందన్నారు. పదిశాతం ఇస్తేపరిస్థితి ఏవిధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. తెలంగాణ కోసం కొట్లాడిన ఉద్యోగ, ఉపాధ్యాయులు జీతాలకోసం అడుక్కునే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ జీతం నుంచి దాచుకున్న జీపీఎఫ్ సొమ్మునుకూడా ఇవ్వకుండా ప్రభుత్వం వేధిస్తోందని విమర్శించారు. పీఆర్సీ సహా ఏ సమస్యనూ పరిష్కరించలేని అసమర్థ ప్రభుత్వం ఇదన్నారు. డీఏలు, జీపీఎఫ్, మెడికల్ గ్రాట్యుటి పేరిట ఉద్యోగులకు ప్రభుత్వం రూ. 8,200 కోట్ల బకాయి ఉన్నదన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ కోసం రూ.11వేల కోట్లుచెల్లించలేని దుస్థితి ప్రభుత్వాని దన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగుల కోసం పోరాటం చేసింది బీజేపీ మాత్రమే అన్నారు. సమావేశంలో టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య, తపస్ నాయకులు పాల్గొన్నారు.

రాజన్న హుండీల లెక్కింపు

● 15 రోజులకు రూ.1.69 కోట్ల నగదు
● 116 గ్రాముల బంగారం, 9.80 కిలోల వెండి


డబ్బులను లెక్కిస్తున్న ఆలయ ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిహుండీలను బుధవారం లెక్కించారు. ఆలయ ఆవరణలోని ఓపెన్‌స్లాబ్‌లో ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో హుండీలను విప్పి లెక్కించారు. 15రోజుల హుండీలను లెక్కించగా రాజన్న ఖజానాకు రూ. కోటి 69లక్షల 76వేల867 నగదు, 116 గ్రాముల బంగారం, 9కిలోల 800గ్రాముల వెండి సమకూరినట్లు ఆలయ ఈవో వెల్లడించారు. ఈ హుండీ లెక్కింపులో ఏసీ కార్యాలయ పరిశీలకులు సత్యనారాయణ, ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, ఎస్పీఎఫ్ సిబ్బంది, హోమ్‌గార్డ్స్ భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. హుండీ లెక్కింపులో శ్రీశివ రామకృష్ణ భజన మండలి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

విజ్ఞాన భాండాగారం
కేంద్ర గ్రంథాలయం


గ్రంథాలయంలో చదువుకుంటున్న పాఠకులు, విద్యార్థులు

పాఠకులకు అందుబాటులో 76,785 పుస్తకాలు

విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉపయోగకరం

దిన, వార, పక్ష, మాస పత్రికలు.. 10,105 సభ్యత్వాలు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వేసవి వస్తోంది.. మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో సెలవులొస్తాయి. మధ్యాహ్నం ఎండ సమయంలో తప్ప ఉదయం, సాయంత్రం వేళల్లో సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ముఖ్యంగా విద్యార్థులు జ్ఞాన సమపార్జనకు మంచి పుస్తకాలు చదవాలి. ఇందుకోసం సమీపంలోని గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి. సెలవుల్లో విద్యార్థులతోపాటు పోటీ పరీక్షల అభ్యర్థులు, పాఠకులకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి.ఈ నేపథ్యంలో జిల్లా కేంద్ర గ్రంథాలయం, అనుబంధంగా పిల్లల గ్రంథాలయంతో పాటు 11 మండలాల్లో ఉన్న గ్రంథాలయాల్లో సభ్యత్వం పొందడం, పుస్తకాల వివరాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

పుస్తకాలు.. సభ్యులు..

జిల్లా పరిధిలో కేంద్ర గ్రంథాలయం, అందులోని చిల్డ్రన్ లైబ్రరీ, 11 మండలాల్లో కలిపి వివిధ భాషలకు చెందిన 2 లక్షల 8 వేల 399 పుస్తకాలు, ఒక్క కేంద్ర గ్రంథాలయంలో 76,785 పుస్తకాలతో పాటు దిన, వార, పక్ష, మాస పత్రికలు అందుబాటులో ఉన్నాయి. జిల్లా కేంద్రంలోనే 10,105 మంది సభ్యులుండగా 11 మండలాల్లో 5 వేల 939 మంది సభ్యులున్నారు.

సభ్యత్వం పొందడం ఇలా

ఏప్రిల్ 2024 నుంచి సభ్యత్వ రుసుము 300 రూపాయలు చేశారు. ఆ రుసుము చెల్లించి, ఆధార్ కార్డ్ జిరాక్స్ ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో అందజేస్తే జీవితకాల సభ్యత్వం పొందవచ్చు. డిజిటల్ సభ్యత్వ గుర్తింపు కార్డు కూడా ఇస్తారు. తమకు కావాల్సిన పుస్తకాలను ఇంట్లో కూడా చదువుకొని రెండు వారాల గడువులో తిరిగి గ్రంథాలయంలో అప్పగించాల్సి ఉంటుంది. పోటీ పరీక్షల పుస్తకాలు, 6 నుంచి డిగ్రీ స్థాయి వరకు పుస్తకాలు, గైడ్లను గ్రంథాలయంలోనే చదువుకోవాల్సి ఉంటుంది. ఆయా మండలాల్లో అక్కడే సభ్యత్వం పొందవచ్చు.

సమయాలు

జిల్లా కేంద్ర గ్రంథాలయం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. ప్రతి శుక్రవారం, ప్రభుత్వ సెలవు దినాల్లో లైబ్రరీ సేవలుండవు. స్టడీ అవర్స్ మాత్రం ప్రతి రోజు 24 గంటల పాటు నిర్వహిస్తారు. మండలాల్లోని గ్రంథాలయాలు ఉదయం 10-30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తాయి.

కేంద్ర గ్రంథాలయంలో అన్ని సౌకర్యాలు

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. సభ్యత్వ నమోదు, మౌలిక వసతుల కల్పన, విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు, పాఠకుల ప్రయోజనం కోసం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కార్యదర్శి సరితతో పాటు సిబ్బంది ప్రత్యేక చొరవ కనబరుస్తున్నారు. పోటీ పరీక్షల అభ్యర్థుల రిలాక్స్ కోసం ప్రతి రోజూ చైర్మన్ తన సొంత ఖర్చులతో తేనీరు అందిస్తున్నారు. సభ్యులకు డిజిటల్ కార్డులను మంజూరు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు కొత్తగా వస్తున్న పుస్తకాలను తెప్పిస్తున్నారు. డీసీఎల్‌లో ఇంటర్‌నెట్, వైఫై సదుపాయం ఉంది. ఒక నెలలో డీసీఎల్‌లో ఉన్న పుస్తకాల పేర్లు, సంఖ్య వివరాలు బార్‌కోడ్‌తో సహ డాటాలో ఎంట్రీ చేయనున్నారు. మెంబర్‌షిప్ కార్డులను కూడా సిస్టంలో డిజిటలైజేషన్ పూర్తి చేస్తున్నారు.



కరీంనగర్ గ్రంథాలయ ముఖ ద్వారం

మహాశివరాత్రి జాతరకు ముమ్మర ఏర్పాట్లు

● ఆలయ ఆవరణలో వేగంగా జరుగుతున్న పనులు
● ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న అధికారులు



ఆలయ గుడి చెరువులో శివార్చన వేదిక వద్ద ఏర్పాట్లను చేస్తున్న సిబ్బంది, (ఇన్‌సెట్లో) ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్న సూచికలు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి జాతరకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. మరోనాలుగు రోజులు మాత్రమే మిగిలివుండటంతో జాతరఏర్పాట్లను అధికారులు వేగవంతంగా చేస్తున్నారు. రాజన్న ఆలయానికి మహాశివరాత్రి జాతరను పురస్కరించుకుని సుమారు నాలుగులక్షల మంది వరకు భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ గడిచెరువులో భక్తులను అలరించేందుకు సుమారు 800మంది కళాకారులతో ప్రదర్శన నిర్వహించేందుకు శివార్చన వేదికను ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు వీక్షించేందుకు చలువ పందిళ్లను భారీగా ఏర్పాటుచేసి ఎక్కడ కూడా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా బారికేడ్స్, పోలీస్‌సిబ్బందిని ఏర్పాటు చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నారు. రాజన్నఆలయ ఈవో వినోద్‌రెడ్డి, ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, శ్రావణ్ కుమార్, డీఈ రఘునందన్‌లు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. వాహనాల్లో జాతరకు వచ్చేభక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పట్టణశివారు నుంచి వీఐపీ, వీవీఐపీ పార్కింగ్ స్థలం గుర్తించేలా సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తూ, పట్టణ మ్యాప్‌నుసైతం ఫ్లెక్సీల రూపంలో భక్తులకుఅందుబాటులోకి తీసుకవస్తున్నారు. ప్రధానకూడళ్లవద్ద ఫ్లెక్సీలుఏర్పాటు చేయడంతో భక్తులు సులువుగా పార్కింగ్‌స్థలాలకు చేరుకునేలా సిద్ధం చేస్తున్నారు. రాజన్న ఆలయంలోని గోపురాలకు, విద్యుత్ దీపాలు, పార్కింగ్ ఏరియా, సైన్‌బోర్డ్స్ఏర్పాటు చేస్తున్నారు.

రేషన్ సరుకులు సక్రమంగా అందించాలి

బషీరొద్దీన్, తహసీల్దార్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: మండలంలోని 12 గ్రామాల్లో ఎన్ని తెలుపు రేషన్‌కార్డులు, అంత్యోదయ అన్నయోజన కార్డులు ఉన్నాయి?

తహసీల్దార్: తెల్ల రేషన్‌కార్డులు 6518, ఏఏవై కార్డులు 458 ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: ఎంతమంది కార్డు హోల్డర్స్ లబ్ధి పొందుతున్నారు?

తహసీల్దార్: 18,346 మంది లబ్ధిదారులకు బియ్యం ద్వారా లబ్ధి పొందుతున్నారు.

ఆంధ్రజ్యోతి: ప్రతీ నెల ఎన్ని క్వింటాళ్ల బియ్యం వస్తున్నాయి?

తహసీల్దార్: ప్రతీ నెల తెలుపు రేషన్‌కార్డు దారులకు 1194 క్వింటాళ్ల బియ్యం సరఫరా అవుతున్నాయి.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని రేషన్‌షాపులు ఉన్నాయి?

తహసీల్దార్: 16 రేషన్‌షాపులు ఉన్నాయి. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12, మధ్యాహ్నం 4 నుంచి సాయంత్రం 6వరకు రేషన్‌డీలర్లు బియ్యం పంపిణీ చేస్తారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



శివాజీ విగ్రహావిష్కరణలో ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, శివాజీ వేషధారణలో ఉన్న విద్యార్థులతో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్

ధర్మారం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పి మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించిన ధీరుడు ఛత్రపతి శివాజీ అని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. బుధవారం పత్తిపాకలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆయన ధైర్య సాహసాలతో చేసిన పోరాటం వల్లనే భారతదేశం మొఘలుల సామ్రాజ్యం నుంచి రక్షించబడిందని కొనియాడారు. ఏఎంసీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, మాజీ ఎంపీపీ కడారి హన్మయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ కొత్త నర్సింహులు, రవీందర్ రెడ్డి, అజయ్‌పాల్ రెడ్డి, గంధం మహిపాల్ పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్: ఛత్రపతి శివాజీ జయంతిని గోదావరిఖనిలో ఘనంగా నిర్వహించారు. ఆరె కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జీఎం కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పాల్గొన్నారు. శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. శివాజీ పరిపాలన నేటి పాలకులందరికి ఆదర్శప్రాయమన్నారు. హిందూ, ముస్లిం తేడా లేకుండా దేవాలయాలు, మసీదులను పునరుద్ధరించారని, కొందరు శివాజీని హిందూ రాజుగా అభివర్ణిస్తున్నారని పేర్కొన్నారు. అదర్‌సండే సమ్మారావు, డ్యాగం చంద్రమోహన్, లింగారావు, వీరన్న, రాజేశ్వర్‌రావు, రవి, మహంకాళి స్వామి, పాల్గొన్నారు. ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం, ఆలయ ఫౌండేషన్, తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు అంబేద్కర్ భవన్‌లో నిర్వహించారు.

ఓదెల: కనగర్తిలోని శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాయమ్మ పల్లెలో ఆరెకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ, కేక్ కట్ చేశారు. ఆది సతీష్, తూడి రాజేందర్, కందునూరి సురేందర్, గిరాం సాంబమూర్తి, పాల్గొన్నారు.

సుల్తానాబాద్: పట్టణంలోని పూసాల రోడ్డులో ఛత్రపతి శివాజీ జయంతి యువసేన అధ్యక్షుడు ఎనగందుల సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు కూకట్ల నాగరాజు, కుమార్, సదయ్య, సోడా శ్రీను, పాల్గొన్నారు. గర్రెపల్లి బస్టాండ్ చౌరస్తా వద్ద నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ నేతలు జెట్టి శ్రీనివాస్, మహేష్, కుందేళ్ల సతీష్, రాజు, హరీష్,శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.

కోల్‌సిటీ: దేశ భక్తుడు, ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని కార్పొరేషన్‌లోని 39వ డివిజన్ గౌతమినగర్‌లో ఏర్పాటు చేయాలని మహిళా మోర్చా నాయకురాలు సోమారపు లావణ్య ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీకి వినతిపత్రం అందించారు. కాశిపేట శివాజీ, రవీందర్, సోమారపు అరుణ్, సాగి కిషన్‌రావు, పాల్గొన్నారు.

పెద్దపల్లి కల్చరల్: ట్రినిటీ డిగ్రీ అండ్ పీజీ కాలేజీలో శివాజీ జయంతి నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ డాక్టర్ మమతారెడ్డి శివాజీ చిత్రపటానికి పూలమాలవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు శివాజీ సాహసాలు, గెరిల్లా యుద్ధ విధానంపై మాట్లాడారు. విద్యార్థుల వేషధారణ పలువురి ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ నీతారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రామ్‌చందర్, అధ్యాపకులు సరిత, నిర్మల, అశ్విని పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: కాలనీలో శివాజీ యువత ఆధ్వర్యంలో హనుమాన్ ఆలయం నుండి షాపింగ్ కాంప్లెక్స్ షిర్కే చౌరస్తా మీదుగా తెలంగాణ చౌరస్తా వరకు శోభాయాత్ర నిర్వహించారు. కోలాటం, భజన, శివాజీ పాటలతో ఆకట్టుకున్నది. ఆమంచి శ్రావణ్, మూకిరి రాజు, బాలయ్య, శశి, సురేష్, అనిల్ పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్: పెద్దబొంకూరులో మిట్టపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యదర్శి పుట్ట శ్రీనివాస్, వెంకటేస్, కలవేన రవి, సదానందం, సమ్మయ్య పాల్గొన్నారు. రంగాపూర్, సబ్బితం గ్రామాల్లో యువకులు ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. మేకల కుమారస్వామి, సబ్బితం మాజీ సర్పంచ్ చుంచు సదయ్య, సతీష్, పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్, పెగడపల్లి గ్రామాల్లో ఛత్రపతి శివాజీ మహారాజ్ శోభయాత్ర నిర్వహించారు. ఛత్రపతి శివాజీ జయంతి ఆయన విగ్రహ నిర్మాణానికి మాజీ జడ్పీటీసీలు వంగల తిరుపతిరెడ్డి, గంట రాములు భూమిపూజ చేశారు. నాయకులు సంపత్‌కుమార్, సల్పాల బాలకృష్ణ, శివాజీ మహారాజ్ ట్రస్ట్ అధ్యక్షుడు అరెల్లి ప్రవీణ్‌కుమార్, పెంట రవి, మూల రమేష్‌రెడ్డి, తూడి నరేష్ పాల్గొన్నారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలో వాజీ మహారాజ్ జయంతి నిర్వహించారు. నాయకులు జంగాపెల్లి శ్రీనివాస్, సతీష్, గన్నవపు రవి, బొంగోని శ్రీనివాస్, బిల్ల అంజి, అనుదీప్, నల్లవెల్లి శంకర్, పాల్గొన్నారు.

ఊపందుకున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

5వ పేజీ తరువాయి

అభ్యర్థులతో కలిసి ప్రచారం నిర్వహించనున్నారు. బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ నేరుగా ఓటర్లతో ప్రచారం నిర్వహిస్తున్నారు. బీసీ నినాదంతో ఆయన ముందుకు వెళుతున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఈ ఎన్నికల్లో అభ్యర్థులను పెట్టనప్పటికీ, కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్‌సింగ్ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి, యాదగిరి శేఖర్ రావులకు బీఆర్‌ఎస్ శ్రేణులు కొందరు పని చేస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు గట్టి పోటీనిస్తున్న ప్రసన్న హరికృష్ణ కొందరు బీఆర్‌ఎస్ నాయకులు అంతర్గతంగా మద్దతునిస్తున్నట్లు కనబడుతున్నది.

● వాయిస్ మెస్సేజ్‌లు, ఎస్‌ఎంఎస్‌లతో

పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానం 13 జిల్లాలకు విస్తరించి ఉండడంతో అభ్యర్థులకు నేరుగా ఓటర్లను కలిసే పరిస్థితి లేకపోవడంతో వారి సెల్ నంబర్లు సేకరించి వాయిస్ మెస్సేజ్‌లు, ఎస్‌ఎంఎస్ లను పంపిస్తున్నారు. ఒక్కో అభ్యర్థి కనీసం రెండు సార్లయినా వాయిస్ మెస్సేజ్‌ల ద్వారా తమ పేరు చెప్పుకుంటూ బ్యాలెట్ పేపర్‌లో తమ సీరియల్ నంబర్ చెబుతూ మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. మరి కొందరు అభ్యర్థులు ఓటర్లకు వారి సెల్ ఫోన్లకు ఎస్‌ఎంఎస్‌లు పంపిస్తున్నారు. ఈ ఎస్‌ఎం ఎస్‌ల్లో ఓటరు పేరు, పోలింగ్ స్టేషన్ నంబర్, చిరునామాతో పాటు అక్కడి జాబితాలో ఓటరు సీరియల్ నంబర్, పోలింగ్ తేదీని పేర్కొంటున్నారు. అలాగే ఎక్క డికక్కడే వాట్సప్ గ్రూపులను సైతం ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు పోటాపోటీగా, రసవత్తరంగా జరుగుతున్నాయి.

విద్యార్థులను అభినందించిన కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కుంగ్ ఫూ, కరాటే పోటీలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులను కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం అభినందించారు. ఈనెల 16న రాజన్నసిరిసిల్ల జిల్లాలో జరిగిన పోటీలలో పెద్దపల్లి విద్యార్థులు మంచి ప్రతిభ కనబరించారన్నారు. గోదావరిఖనికి చెందిన 20మంది మాస్టర్ ఎం.రాజేశం ఆధ్వర్యంలో 10బంగారు పతకాలు, 3వెండి పతకాలు సాధించారన్నారు. కరాటే కుంగ్‌ఫూ మాస్టర్ ఎం.రాజేశం, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ఎలిగేడు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): సుల్తాన్‌పూర్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న కనుకుంట్ల అరవింద్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో అనసూరి నరేంద్రచారి తెలిపారు. 15న పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ బాలబాలికల కబడ్డీ పోటీలలో అరవింద్ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. బుధవారం ఎంఈవో, జిల్లా కబడ్డీ కార్యదర్శి కరుణాకర్‌రెడ్డి, పీడీ ఎల్.శ్రీనివాస్, అభినందించారు.

ధర్మారం: వికారాబాద్ జిల్లాలో ఈ నెల 20 నుంచి 23 వరకు జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీలకు సాయి మణికంఠ మోడ్రన్ హైస్కూల్ విద్యార్థి కె. అరుణ్ ఎంపియ్యాడు. ఈ నెల 16న జగిత్యాల జిల్లాలో నిర్వహించిన సబ్ జూనియర్ కబడ్డీ ట్రయల్స్‌లో ప్రతిభ కనబరచిన అరుణ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ జైన సురేష్‌కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ రమాదేవి తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

పాలకుర్తి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం ఎంపీడీవో కలికోట రామ్‌మోహన చారి పర్యటించారు. వేమునూర్, కుక్కలగూడూర్, పుట్నూర్ గ్రామాల్లోని నర్సరీలలో మొక్కలను పరిశీలించారు. పుట్నూర్ కేజీబీవీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఆహారం అందించాలన్నారు. ఎంపీడివో ఉప్పు సుదర్శన్, ఉన్నారు.

కుట్టు శిక్షణతో ఉపాధి పొందాలి

రామగిరి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని ఎస్‌ఎసి ఏడి రమేశ్ అన్నారు. బుధవారం కల్వచర్లలో రేండ్ల శారద కుమారస్వామి ఆధ్వర్యంలో సుమారు మూడు వందల మంది మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ ఇచ్చి అర్హత పరీక్ష నిర్వహించారు. శిక్షణ తీసుకొని సర్టిఫికెట్ పొందేందుకు ఒక్కో మహిళకు రూ.1250 చొప్పున 3వందల మందికి కుమారస్వామి చెల్లించాడన్నారు. ఇన్‌స్ట్రక్టర్‌సబిత, శ్రీనివాస్, శ్యామల పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్ రెడ్డి గెలుపునకు కృషి చేయాలి



క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న మెమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి గెలుపునకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే విజయరమణారావు సూచించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, పట్టభద్రులతో సమావేశం నిర్వహించారు. అల్ఫోర్స్ అధినేత వూట్కూరి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించి కాంగ్రెస్ జెండా ఎగరవేసే విధంగా పనిచేయాలని సూచించారు. మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, వైస్ చైర్మన్ మల్లారెడ్డి, నాయకులు కదర్ల శ్రీనివాస్, సురేష్ గౌడ్, నూగిళ్ల మల్లయ్య, బండారి రాంమూర్తి, రాజేందర్, పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకులకు దమ్ముంటే ప్రధాని నరేంద్రమోదీతో దేశంలో బీసీ కులగణన చేయించాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండల కేంద్రంలో పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి గెలుపుకోసం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలన్నారు. అనంతరం ఆరెపల్లిలో ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, టీంవిఎస్‌ఆర్ మండల అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ లంక సదయ్య, గాజనవేన సదయ్య, ఎ రాజమల్లు, తదితరులు పాల్గొన్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి

ముత్తారం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్నులు ఈనెల 25 లోపు వందశాతం వసూలు చేయాలని డిఎల్‌పీవో సతీష్‌కుమార్ అన్నారు. బుధవారం కేశనపల్లి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని డిఎల్‌పీవో సతీష్‌కుమార్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, నర్సరీ, శ్మశానవాటికను పరిశీలించారు. కార్యదర్శి బూర్ల రాజేందర్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

తనిఖీలకు సహకరించాలి

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపాధిహామీ పనుల తనిఖీలకు కార్యదర్శులు , ఈజీఎస్ సిబ్బంది ఆడిట్ సిబ్బందికి సహకరించాలని అంబుడ్స్‌మెన్ శరత్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉపాధిహామీ ద్వారా చేపట్టిన పనులను 15వ విడత సామాజిక తనిఖీల అంశంపై కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో అధికారులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శరత్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టే తనిఖీలకు సిబ్బంది సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీవో ఫయాజ్, ఏపీవో రమేష్‌బాబు, స్టేట్ రిసోర్స్ పర్సన్ దెవెందర్, జేఈ రాజయ్య, టెక్నికల్ అసిస్టెంట్‌లు వెంకటేష్,దివ్య, సురేష్, కంప్యూటర్ ఆపరేటర్ సుజాత, పంచాయతీ కార్యదర్శులు , ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

మట్టి తరలించవద్దని నిరసన

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పాలితం నుంచి మట్టిని తరలించవద్దని బుధవారం గ్రామస్థులు నిరసన తెలిపారు. పాలితం గుట్ట నుండి రోడ్డు పనులకు అనుమతులు తీసుకోని తరలిస్తుండగా అధికారులకు ఫిర్యాదులు చేశారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు గ్రామస్థులతో మాట్లాడారు. ఎస్‌ఐ మల్లేష్ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు తీసుకోని, ప్రజావసరాల నిమిత్తం మట్టిని తరలిస్తున్నారని, సమస్య ఉంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయాలని సూచించారు. అడ్డుకుంటే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాను పాల్గొన్నారు.

మెట్లు ఏర్పాటు చేయాలి

పెద్దపల్లిటౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి)పెద్దపల్లి బస్టాండ్ సమీపంలో గల బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద మెట్లు ఏర్పాటు చేయాలని బొంకూరి కైలాసం అధికారులను కోరారు. బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ వేణుకు వినతిపత్రం అందజేశారు. విగ్రహాన్ని ఏర్పాటు చేసి మెట్ల నిర్మాణం చేయకపోవడం వల్ల జయంతి, వర్ధంతి సందర్భంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. ఆయన వెంట కండె కరుణాకర్ పాల్గొన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో అధికారిని కలవకుండా అడ్డుకుంటున్న అటెండర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రతీ ఒక్కరు లక్ష్యసాధన కోసం పనిచేయాలి



మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి

ఎలిగేడు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్క నాయకుడు లక్ష్యసాధనకు నిరంతరం శ్రమించాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శివాలయంలో మండలస్థాయి బీజేపీ సమావేశంలో మాట్లాడారు. నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యలు పరిష్కరించి అంకితభావంతో పనిచేసినప్పుడే ప్రజానాయకుడిగా గుర్తింపు లభిస్తుందన్నారు. శాసనమండలిలో బీజేపీ వాయిస్‌ని వినిపించేందుకు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తుచేశారు. సమావేశానికి పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఇంచార్జీ గాదె రంజిత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కర్ర సంజవరెడ్డి, పట్టభద్రుల ఎన్నిక ఇన్‌చార్జీ నవీన్‌కుమార్, బీజేపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శిలారపు పర్వతాలు, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి ఆరుముళ్ల పోచం పిలుపునిచ్చారు. సుల్తానాబాద్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని, సామాన్య ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు వస్తాయన్నారు. రెండు ఎమ్మెల్సీ ఎన్నికలలో మొదటి ప్రాధాన్యత ఓట్లను బీజేపీ అభ్యర్థులైన అంజిరెడ్డి, మల్క కొమురయ్యలకు వేసి గెలిపించాలని కోరారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు కందుల శ్రీనివాస్, మండల కన్వీనర్లు మహేందర్ యాదవ్, కొమ్ము తిరుపతి, ఎల్లంకి రాజు,కొల్లూరి సంతోష్ కోట నాగేందర్ పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు చిన్నమైల్ చిన్నమైల్ అంజిరెడ్డి, మల్క కొమురయ్యలను గెలిపించాలని బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇంచార్జీ కందుల సంధ్యారాణి కోరారు. గుండబోయిన భూమయ్య, అరవిందర్‌రెడ్డి, విశ్వాస్, శ్రీనాథ్, సంతోష్, పాల్గొన్నారు.

ఎల్‌ఈడీ బల్బుల తయారీపై శిక్షణ

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని కృష్ణవేణి విద్యాసంస్థలో సైంటిస్ట్ మల్లేశం పర్యవేక్షణలో ఎల్‌ఈడీ బల్బ్‌ల తయారీపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విద్యాసంస్థల డైరెక్టర్ మంజుల శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్‌ను అందించడానికి విద్యా సంస్థలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. అనంతరం ఎల్‌ఈడి బల్బ్‌లను తయారు చేసే విధానంపై శిక్షణ ఇచ్చారు. ప్రెస్‌క్లబ్ ప్రధానకార్యదర్శి శ్యామ్‌సుందర్, పాత్రికేయులు భైరం సతీష్, మామిడి సత్యనారాయణ, విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు మరచిన ఎమ్మెల్యే



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కౌశిక హరి

గోదావరిఖని, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఎమ్మెల్యే ప్రజలకు ఇచ్చిన హామీలను మరిచిపోయారని బీఆర్‌ఎస్ నాయకుడు కౌశిక హరి ఆరోపించారు. బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గోదావరిఖనిలో కూల్చివేతలు తప్ప కట్టడాలు లేవనిన్నారు. ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదని, ప్రణాళిక లేకుండా పనులు నిర్వహిస్తున్నారని, కాంట్రాక్టర్లు పనులు చేయకుండా పారిపోతున్నారన్నారు. ఎమ్మెల్యే బూడిద, ఇసుక, మట్టి ఉచితమని చెప్పినప్పటికీ డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. తెలంగాణ థర్మల్ ప్రాజెక్టుకు చెందిన బూడిదను ఎన్‌టీపీసీ యాజమాన్యమే టెండర్ ద్వారా ఇవ్వాలని, అవినీతి జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టీపీసీ యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు మాదాసు రామమూర్తి, బక్కి కిషన్, జోసఫ్, సర్వర్‌పాషా, మారం వెంకటేష్, హరీష్, స్వప్న పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ బుధవారం తెలంగాణ ఉద్యమ ఫోరం రాష్ట్ర నాయకులు తోడేటి శంకర్‌గౌడ్, బొడ్డు రవీందర్ ఆధ్వర్యంలో పోస్టుకార్డులతో ముఖ్యమంత్రికి విన్నవించారు. కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు 250చదరపు గజాల ఇంటి స్థలం, రూ.25వేల పెన్షన్, ఎఫ్‌ఐఆర్ నమోదు అయిన ప్రతి ఉద్యమకారునికి ఇంటి నిర్మాణానికి రూ.10లక్షలు ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పి అమలు చేయడం లేదన్నారు. అనుముల కళావతి, కనుకుంట్ల రమేష్, ఈదునూరి నర్సింగ్, కోరె శంకర్, సీత పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

కోల్‌సిటీ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రామగుండం కమిషనర్, అదనపు కలెక్టర్ అరుణశ్రీ బుధవారం వివిధ డివిజన్లలో టీయూఎఫ్‌ఐ డీసీ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్‌లలో రోడ్ల వెడల్పు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, నీటి సరఫరా పైప్‌లైన్లు, నల్లా కనెక్షన్ల పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. 6, 7 డివిజన్ల పరిధిలోని ఐబీ కాలనీ, పవర్‌హౌస్‌కాలనీ, సప్తగిరి కాలనీల్లో జరుగుతున్న నాలా ఆధునీకరణ పనులను పరిశీలించారు. పనుల త్వరితగతిన పూర్తి చేసేందుకు సమన్వయంతో పని చేయాలని టౌన్ ప్లానింగ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకుకు సహకరించండి

స్వచ్ఛ స్వరేక్షణ్ సర్వేలో సిటీజన్ ఫీడ్ బ్యాక్ విభాగంలో మెరుగైన ర్యాంకు సాధించేందుకు ఆర్‌పీలు సహకరించాలని కమిషనర్ కోరారు. అర్హులైన వారిని గుర్తించి కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించేలా ప్రోత్సహించాలని, తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. తిలక్‌నగర్‌లోని మణిచంద్ర మహిళా స్వశక్తి సంఘం బ్యాంకు లింకేజీతో ఎంబ్రాయిడరీ కుట్టు యంత్రాన్ని ఏర్పాటు చేయగా యూనిట్‌ను సందర్శించిన అరుణశ్రీ నిర్వాహకులను అభినందించారు. డీసీ వెంకటస్వామి, ఎస్‌ఈ శివానంద్, ఈఈ రామన్, ఎస్‌ఐ నాగభూషణం, కుమారస్వామి, సునీల్ రాథోడ్, ఇంజనీర్ మధుకర్, కో ఆర్డినేటర్ మౌనిక, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

రేపు కేంద్ర మంత్రి బండి సంజయ్ పర్యటన

పెద్దపల్లిటౌన్ , ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లికి కేంద్రమంత్రి బండి సంజయ్ ఈనెల 21న వస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి తెలిపారు. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల తరుపున ప్రచారంలో సమావేశానికి పార్టీ శ్రేణులు, పట్టభద్రులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలి

ముత్తారం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ విద్యార్థి సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని ఎంఈవో హరిప్రసాద్ అన్నారు. బుధవారం తెలంగాణ ఆదర్శ పాఠశాలను సందర్శించారు. బోధన వ్యూహాలను రూపొందిస్తూ అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రధానోపాధ్యాయులు కేసరి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

సుల్తానాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని వసతి గృహ సంరక్షులకు మున్సిపల్ కమిషనర్ మహ్మద్ నియాజ్ సూచించారు. కమిషనర్ బుధవారం బీసీ, ఎస్సీ హాస్టళ్లను తనిఖీ చేశారు. విద్యార్థులు వినియోగిస్తున్న వాష్ రూమ్‌లను, గదులను, పరిసరాలను పరిశీలించారు. చెత్త చెదారాన్ని తొలగించాలన్నారు.

ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మంథని డివిజన్ కార్యదర్శి బీ అశోక్ డిమాండ్ చేశారు. హామీలను అమలు చేయాలనే డిమాండ్‌తో ఈనెల 20న హైద్రాబాద్‌లో మహాధర్నా చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. బుధవారం ఆర్జీ-2 ఏరియాకు చెందిన వివిధ సెక్షన్‌ల కాంట్రాక్టు కార్మికుల సమక్షంలో మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. దుర్గేష్, రాజబాబు, లింగయ్య, శంకరమ్మ, లక్ష్మి, రజిత పాల్గొన్నారు.



పిల్లల వైద్యుడిని నియమించాలి

గోదావరిఖని, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఏరియా ఆసుపత్రి లో పిల్లల వైద్యుడిని నియమించాలని టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామమూర్తి కోరారు. బుధవారం టీబీజీకేఎస్ ఆర్‌జీ-1 ఉపాధ్య క్షులు వడ్డేపల్లి శంకర్ ఆధ్వర్యంలో సింగరేణి ఏరియా ఏసీఎంఓ కిరణ్ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. హాస్పిటల్‌లో పిల్లల వైద్యులు లేక కార్మికులు ఎదుర్కొంటున్నారని, మూడు రోజుల ఒక సారి రామకృ ష్ణాపూర్ నుంచి పిల్లల వైద్యుడు వచ్చి వెళుతున్నాడన్నారు. పిల్లల వైద్యుడు లేక ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారన్నారు. సతీష్, శేషగిరి, అంజయ్య, శ్రీనివాస్, జోసఫ్, సాయి కృష్ణ, రవీందర్, మురళి పాల్గొన్నారు.

ఏరియా హాస్పిటల్ పిట్ సెక్రటరీగా అఫ్సర్ పాషా

గోదావరిఖని, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): టీబీజీకేఎస్ ఆర్‌జీ-1 ఏరియా హాస్పిటల్ పిట్ సెక్రటరీగా అఫ్సర్ పాషాను నియమిస్తూ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. అఫ్సర్‌పాషా మాట్లాడుతూ కార్మికులు, వారి కుటుంబాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేం దుకు కృషి చేస్తానని చెప్పారు. నియామకానికి కృషి చేసిన అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామమూర్తి, నూనె కొమురయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఓబీ కార్మికుల వేతనాలపై ఎమ్మెల్యే సమక్షంలో చర్చలు

గోదావరిఖని, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్‌జీ-1, 2 ఓసీపీల్లో ఓబీ కంపెనీలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు రెండు రోజులుగా సమ్మె చేస్తున్నారు. బుధవారం ఓబీ కంపెనీల ప్రతినిధులతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇద్దరు జనరల్ మేనేజర్లు, కార్మిక నాయకుల సమక్షంలో నిర్వహించిన చర్చలు సఫలమయ్యాయి. కాంట్రాక్టు కార్మికుల వేతనాల గురించి ఓబీ కంపెనీలు పీసీ పటేల్, ఆర్‌వీఆర్, వీ9, సీ5, హెచ్‌డీ కంపెనీల ప్రతినిధులతో కార్మిక నాయకులు ఒప్పందం చేసుకొన్నారు. డ్రైవర్లకు ప్రస్తుత బేసిక్‌పై అదనంగా రూ.2800, హెల్పర్లకు రూ.1680 పెంచామన్నారు. మిగతా వారికి నిష్పత్తి ప్రకారం పెంచేందుకు ఒప్పందం జరిగింది. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రివర్యులు దుద్దిళ్ల బాబు సహకారంలో రామగుండం నియోజకవర్గంలో అన్నీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఓబీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై తన దృష్టికి రాగానే ఓబీ కాంట్రాక్టు కంపెనీలతో చర్చలు నిర్వహించి కార్మికులకు ఆమోద్య యోగ్యమైన వేతన ఒప్పందం చేశామన్నారు. అనంతరం ఓబీ కాంట్రాక్టు కార్మికులు మెరుగైన వేతన ఒప్పందం చేసిన రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఓసీపీ-1 బేస్‌వర్క్‌షాప్ కార్మికుల ఔదార్యం

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఇంజనీర్‌కు ఆర్థికసాయం చేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు ఓసీపీ-1 బేస్‌వర్క్ షాప్ కార్మికులు. కమిన్స్ సర్వీస్ ఇంజనీర్ సంజీవ్ వైద్య చికిత్స నిమిత్తం రూ. 52వేలను బుధవారం సంజీవ్‌కు అందజేశారు. ఇంజనీర్లు, గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల నాయకులు, ఆయా సెక్షన్‌ల కార్మికులు పాల్గొన్నారు.

పదోన్నతిపై వెళ్తున్న అధికారికి సన్మానం

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఓసీపీ-3 ప్రాజెక్టు ఆఫీసర్‌గా పనిచేస్తూ కార్పొరేట్ సీఎంసీగా బదిలీపై వెళ్తున్న మధుసూదన్‌ను బుధవారం ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు సన్మానించారు. ఓసీపీ-3 ప్రాజెక్టు వార్షిక లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేసిన మధుసూదన్ సేవలను గుర్తు చేసుకున్నారు. లక్ష్మణ్, బొంకూరి మధు, కిష్టయ్య, బాలంకుస్ పాల్గొన్నారు.

పదవీ విరమణ అధికారికి సన్మానం

రామగిరి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ మార్కెట్ విభాగం జనరల్ మేనేజర్ రవీకుమార్ పదవి విరమణ సందర్భంగా ఆర్జీ-3 జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై సన్మానించారు. సత్యనారాయణ, శ్రీనివాసులు, వెంకటరమణ, చంద్రశేఖర్, రాజారెడ్డి, జనార్దన్‌రెడ్డి, రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

ఆర్జీ-3,ఏపిఏ డివిజన్‌లో క్వార్టర్స్ కౌన్సెలింగ్

రామగిరి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపిఏ డివిజన్ పరిధిలోని సెక్యూరిటి కార్యాలయంలో బుధవారం జీఎం సుధాకర్‌రావు ఆదేశాల మేరకు అధికారులు క్వార్టర్స్ కౌన్సెలింగ్ చేపట్టారు. మొత్తం 179 ఖాళీ క్వార్టర్లు ఉండగా, ఫ్రెష్ అలాట్మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్ల కోసం 88 మంది దరఖాస్తు చేసుకోగా అందులో 38 మంది ఉద్యోగులు హాజరై 34 క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారు. సుదర్శనం, సాయికృష్ణ, శ్యామల, ఫణీంద్ర, పాల్గొన్నారు.